

నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోలు

కలిదిండి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'వాతావరణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. మండలంలో 2024-25 ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి ఇప్పటి వరకు 1813.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులు కోరిన మిల్లులకు తరలించామన్నారు.



బకాయి సొమ్ములు విడుదల చేయాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన డబ్బులు విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శివకుమార్, యర్రా మధు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, వసతి దీవెన రూ.1,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎం. క్రాంతికుమార్, యు.రవి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద హెల్త్ అసిస్టెంట్‌లు ధర్నా నిర్వహించారు. తాము 2003 నుంచి ఉద్యోగం చేస్తున్నామని, తమను అకారణంగా తొలగించారని, తక్షణం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డి.వి రామకృష్ణ, డి.వి రామారావు, బి.నరసింహ రాజు, ఓ.వి.ఎం. నెహ్రూ, ఎన్.తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



కొఠారు ఇంటి ఎదుట బైఠాయించిన శ్రీపర్రు గ్రామ మహిళలు

ఐదేళ్ల కౌలు సొమ్ము దోచుకున్న 'కొఠారు'..

పెదవేగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు ఇద్దరూ కలిసి తమ ఐదేళ్ల కౌలు సొమ్ము దోచుకున్నారని, ఆ సొమ్ము మొత్తాన్ని కక్కించేవరకు ఆందోళన కొనసాగిస్తామని శ్రీపర్రు గ్రామస్థులు స్పష్టం చేశారు. చేపల చెరువుల లీజు సొమ్ములకు సంబంధించి కొమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర శుక్రవారం, శనివారం ఆందోళనలు చేసిన విషయం పాఠకులకు విదితమే. కాగా శ్రీపర్రుకు చెందిన దాదాపు 200 మంది పైగా మహిళలు సోమవారం నిరసన తెలిపారు. కొఠారు ఇంటి ఎదుట రోడ్డుపైనే వంటావార్పు చేపట్టి, అక్కడే సామూహికంగా భోజనాలు చేశారు. ఘంటసాల వెంకట నరస, ముంగర వెంకటేశ్వరమ్మ, సైదు కృష్ణలీల తదితరులు మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి దౌర్జన్యంగా చేపల చెరువుల లీజు సొమ్మును తన వద్దే పెట్టుకుని మా అందరి పొట్టమీద కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.




సమస్యలు వింటున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ కిశోర్

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్

ఏలూరు రూరల్/ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్ర మంలో అర్జీదారుల నుంచి 219 దరఖాస్తులు స్వీకరించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు తదితరులు వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణకు ఆయా మండలాలకు నిర్దేశించిన నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో సదస్సులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. వివిధశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సైబర్ నేరగాళ్లు పంపించే అనుమానాస్పద కాల్స్, మెస్సేజ్, ఈ-మెయిల్స్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీతో పాటు, ఏఎస్పీ సూర్యచంద్రరావు 35 ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు.



గుట్టు..రట్టయ్యేనా?

నేటి నుంచి 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు

- ఆపై 45 రోజుల్లోనే పరిష్కార మార్గాలు
- ఇళ్ల పట్టాల పైనే అత్యధికుల అటెన్షన్
- అసైన్డ్, వివాదాస్పద భూములపైనా దృష్టి
- గత పాలకుల భూ ఆక్రమణలపై ఆరా
- పేదోడికి న్యాయం కోసమే ప్రాధాన్యత

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు భూచక్రం తిప్పారు. లెక్కలేనని వివాదాలు సృష్టించారు. పార్టీలపరంగా విభేదాలు సృష్టించి వేధించారు. అర్హత ఉన్నా.. లేకున్నా అనేక మందికి పక్కా ఇళ్లతో పాటు ఇళ్ల పట్టాలు కట్టబెట్టారు. కొందరి భూములను 22 ఏ పరిధిలోకి చేర్చి ఇబ్బందుల పాల్జే శారు. రీసర్వేల పేరిట గ్రామాల్లో లేని గొడవలు సృష్టించారు. ఇలాంటి క్రమంలోనే వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు, అర్హులకి న్యాయం చేసేందుకు ఈ నెల 10 నుంచి వచ్చే 8వ తేదీ వరకు 33 రోజుల రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుడుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు, భూ బదలాయింపులకు పాల్పడ్డారు. అర్హత ఉన్నా కాదూకూడదంటూ అధికారం ఉంది కదా అని వారికి నచ్చినట్టు చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, బలవంతంగా వారి భూముల ఆక్రమణలకు పాల్పడారు. ఈ పరిస్థితుల్లో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తోంది. భూపరమైన వివాదాలు పరిష్కారం దిశగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని తల పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సదస్సులు ఈ నెల 6వ తేదీనే ఆరంభమయ్యాయి. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాల్సి రావడం, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులకు వీలు కల్పించారు. జిల్లావ్యాప్తంగా గ్రామాలన్నింటిలోనూ ఈ సదస్సుల నిర్వహణకు వీలుగా షెడ్యూల్ ప్రకటించారు. ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో 256 గ్రామాలు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 256, నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 145 గ్రామాలు మొత్తం మీద కలిపి 657 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు. ఈ నెల 10 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 33 రోజుల పాటు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

ఏం చేయబోతున్నారంటే..

గడిచిన ఐదేళ్లల్లో భూవివాదాలు అన్ని చోట్ల తలెత్తాయి. వీటిలో ముఖ్యంగా ఇళ్ల పట్టాల వ్యవహారం. వలంటీర్లు సూచించి సిఫార్సు చేసిన కుటుంబాలన్నింటికీ అలవోకగా పట్టాలు ఇచ్చేశారు. అప్పట్లో గ్రామ, పట్టణ సచివాలయాలే అన్నింటికీ కీలకం. దీనికితోడు ఏకపక్షంగా అనేక చోట్ల ఎడాపెడా పట్టాలు ధారాదత్తం చేశారు. ఇప్పుడు వీటన్నింటి పైనా ఫిర్యాదులకు స్థానికులు సిద్ధమవుతున్నారు. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ, మండల స్థాయిలో జరిగే పరిష్కార వేదికలపైనా అనేక ఫిర్యాదులు ఇప్పటికే నమోదయ్యాయి. వీటిలో కొన్నింటిని పరిష్కరించారు, మరికొన్నింటిని వదిలేశారు. ఇప్పుడు జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వీటిపై క్షుణ్ణంగా నివేదికలు సిద్ధం చేసి చర్యలు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే అర్హత ఉండి, ఇళ్ల పట్టాలు లభించని అనేక మందికి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోబోతున్నారు. వీటికితోడు భూమి లీజు, కేటాయింపుల విషయంపైనా నిగ్గు తేలుస్తున్నారు. వాస్తవానికి ఏ నిబంధనల ప్రకారం భూమి కేటాయించారో తదనుగుణంగా ఆయా భూముల వినియోగం అవుతున్నది, లేనిది పరిశీలిస్తారు. లీజు విషయం లోను ఇదే పద్ధతి పాటించబోతున్నారు. గ్రామంలో అసైన్డ్‌భూమి, ఫ్రీహోల్డ్ భూమి, లీజు భూములు వాటి విస్తీర్ణం, ఎవరెవరికి మంజూరైంది, గతంలో ఎప్పటి నుంచి ఇవి అమలులోకి వచ్చాయి అనే విషయాలను గ్రామసభల్లో ప్రకటిస్తారు. దీనికనుగుణంగా ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వాటిని నమోదు చేసుకుని విచారణ చేపడతారు. రెవెన్యూ పరంగా ఉన్న లోతట్టు సమస్యలు, ఫిర్యాదుల పైనా ప్రాధాన్యత ఇస్తారు. రాజకీయ కక్షపూరితంగా కొందరి భూములను 22ఏ పరిధిలోకి చేర్చడం, తమకు అనుకూలంగా ఉన్నవారికి ఈ భూముల నుంచి విముక్తి కలిగించడం వంటి చర్యలకు ఆనాటి వైసీపీ ప్రభుత్వం పాల్పడింది. ఈ పరిస్థితిని ఎక్కడికక్కడ పరిశీలిస్తారు. గత ఐదేళ్లల్లో జరిగిన భూముల రీసర్వే అనేక వివాదాలకు దారితీసింది. వీటిని సరిచేయాల్సింది గా తహసీల్దార్లు, సర్వేయర్ల చుట్టూ అనేక మంది తిరిగి విసిగిపోయారు. జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ పరిధిలోకి వచ్చిన దాదాపు 120 ఎకరాల వ్యవహారంపైనా ఈ రెవెన్యూ సదస్సుల్లో దృష్టి పెట్టబోతున్నారు. అక్రమంగా సాగిన రిజిస్ట్రేషన్లు డజన్ల సంఖ్యలో ఉన్నాయి. రికార్డులను మార్చి, రిజిస్ట్రేషన్ శాఖను ఏమార్చి భూములను కాజేసిన ఘటనలు ఉన్నాయి. వీటికి ఇతమిద్ధమైన పరిష్కారం ఏనాడూ చూపించలేదు.

45 రోజుల్లోనే పరిష్కార మార్గం

తొలుత 33 రోజులపాటు వరుసగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం, గ్రామస్థాయిలో వచ్చిన ఫిర్యాదులను విచారించి అధికారికంగా నిర్ధారించి ఆ తదుపరి 45 రోజుల్లోనే పరిష్కారం చూపేందుకు కార్యాచరణ రూపొందించారు.

'మూర్తీ'భవించిన విజయం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత గోపిమూర్తి

- 9,165 ఓట్లతో పీడీఎఫ్ తరఫున ఘన విజయం
- చెల్లని ఓట్లు 814
- ఏలూరులో విజయోత్సవ ర్యాలీ



గోపిమూర్తికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ/ఏలూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతా ఊహించినట్లే జరిగింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి స్పష్టమైన ఆధిక్యతతో దూసుకుపోవడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి 9,165 ఓట్లతో విజయకేతనం ఎగుర వేశారు. కాకినాడ జేఎన్టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. మొత్తం 14 టేబుళ్లపై 76మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలను లెక్కించారు. ఈనెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 15, 494ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో భాగంగా 814 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. మిగిలిన 14,680 చెల్లిన ఓట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటిం చారు. లెక్కింపు ప్రక్రియలో యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి 9,165ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి చివరి వరకు ఆయన ఆధిక్యం కనబర్చారు. మరో అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259ఓట్లు లభించడంతో రెండో స్థానంలో నిలిచారు. మిగిలిన అభ్యర్థుల్లో దీపక్ పులుగు 102, నామన వెంకటలక్ష్మి 81, డాక్టరు కవల నాగేశ్వరరావు 73 ఓట్లతో ప్రభావం చూపలేక పోయారు. చెల్లిన ఓట్ల ఆధారంగా విజయం సాధించడానికి 7,341 ఓట్లు రావాల్సి ఉండగా, పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి 9,165 ఓట్లు కైవసం చేసుకున్నారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆయన గెలుపొందినట్టు ప్రకటించి ధ్రువ పత్రాన్ని అందజేశారు. గోపిమూర్తి గెలుపొందడంతో ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు బలపర్చిన ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసుకుని శుభా కాంక్షలు తెలుపుకున్నారు. దీంతో జేఎన్టీయూకే ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది. సోమవారం సాయంత్రం ఏలూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సభ, ర్యాలీ నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాలీ, రవికుమార్ తదితరులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే అత్యధిక మెజార్టీ సాధించి గెలుపొంది గోపిమూర్తి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన విజయానికి కృషిచేసిన టీటీఏ, ఏపీటీఎఫ్-1938, ఏటీఏ, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం యూటీఎఫ్ కార్యాలయం నుంచి జూట్‌మిల్లు, ఓవర్‌బ్రిడ్జి, ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన గోపిమూర్తిని ఏపీఎస్టీయే జిల్లా నాయకులు స్టీవెన్, వెంకటరమణ, ప్రసాద్, శ్రీనివాసరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఏపీజేఏసీ తరఫున రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ అభినందిస్తూ ప్రకటనలు విడుదల చేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి : గోపిమూర్తి



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. కాకినాడ జేఎన్టీయూకేలో విలేకర్లతో సోమవారం మాట్లాడుతూ శాసనమండలిలో ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తుతానన్నారు. సీపీఎస్ రద్దు కోసం విశేషంగా కృషి చేస్తామన్నారు. మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, గిరిజన సంక్షేమపాఠశాలల ఉపాధ్యాయులకు టర్న్ డ్యూటీల ఎత్తివేత, కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసుల క్రమబద్ధీకరణ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కనీస వేతన స్కేలు అమలు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాధారణ సెలవుల మంజూరును 10శాతానికి పరిమితంచేయడం, తదితర సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని వివరించారు. తనను గెలిపించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.



ఏలూరులో యూటీఎఫ్ విజయోత్సవ ర్యాలీలో ఉపాధ్యాయులు

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

ఏలూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ విద్య నభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకూ వర్తింపజేయనున్నారు. ఈ పథకం అమలుకు జిల్లాలో సదుపాయాలు, తదితర అంశాలను ప్రభుత్వ సూచనల మేరకు ఇంటర్‌విద్య జిల్లా అధికారులు పంపించారు. జిల్లాలో మొత్తం 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలుండగా, వీటిలో 3,716 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలలకు సమీపంలో ఏవైనా ప్రభుత్వ/జడ్పీ పాఠశాలలున్నాయా, ఉంటే ఎంతదూరంలో ఉన్నాయి, అక్కడి కిచెన్ షెడ్ల సామర్థ్యం, వసతులు తదితర అంశాల్లో సమాచారాన్ని పంపించారు. ఆ ప్రకారం పాఠశాల విద్య యాజమాన్యంలోని స్కూళ్లలో ఇప్పటికేవున్న వంట ఏజెన్సీల ద్వారా ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం ఆహారపదార్థాలను తయారుచేయించి సంబంధిత జూనియర్ కళాశాలలకు రవాణాచేసే అవకాశాలపై ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. ఇంటర్ విద్యార్థులకు ఎప్పటి నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారన్న సమాచారమేదీ తమవద్ద లేదని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు 2018లో భోజనపథకాన్ని ప్రారంభించగా, ఆ మరుసటేడాది అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వెంటనే నిలిపివేసింది. తిరిగి ఈ పథకాన్ని తాజాగా మళ్లీ ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.



పెయ్యిదూడను అలంకరించి పూజలు చేస్తున్న దృశ్యం.. ఆవుదూడతో యజమాని అడ్డాడ రఘు

ఆవు దూడకు బారసాల

నిడమర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గోవులను దైవంగా భావించి పూజలు చేస్తుంటాం.. అలాంటి గోవులను ఇంట్లో మనుషులతో సమానంగా భావిస్తూ వాటికి పుట్టిన రోజులు, బారసాల కార్యక్రమాలు జరిపించడం కాస్త విడ్డూరంగా అనిపించినా ఫత్తేపురంలో గోమాత పట్ల చూపిస్తున్న ఆదరణ చూసి ముగ్ధులవుతున్నారు. నిడమర్రు మండలం ఫత్తేపురంలో అడ్డాడ రఘు వెంకటరాయపరాజు ఇంటి ముందు ఏడాది క్రితం చూడి ఆవు ఒకటి అసౌకర్యంగా తిరుగుతోంది. చూడి ఆవును ఇలా ఎలా వదిలివేశారంటూ భార్యభర్తలు ఇద్దరూ కూడ బలుక్కొని దానిని ఇంటి ఆవరణలో కట్టేసి వైద్యం చేయించి మంచి పోషకాహారం అందజేశారు. కొద్దిరోజులకు ఆ చూడి ఆవుకు గిత్తదూడ జన్మించింది. ఆ గిత్తదూడకు 21వ రోజున బారసాల నిర్వహించి "అంజు"గా నామకరణం చేశారు. చుట్టు పక్కల వారికి మిఠాయిలు పంచి పెట్టారు. ఇది గతేడాది జరిగిన సంఘటన. ఈ ఏడాది ఆ ఆవు మరలా పెయ్య దూడకు (ఆడ బిడ్డ)కు జన్మనిచ్చింది. దీంతో అడ్డాడ రఘు, పద్మావతి దంపతులు పెయ్యదూడకు సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు మంగళస్నానం చేయించి బారసాల కార్యక్రమం బంధుమిత్రుల మధ్య వైభవంగా నిర్వహించారు. దీనికి "నాగదేవి" అని నామకరణం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల వారిని పిలిచి స్వీట్లు పంచిపెట్టారు. పిల్లలను పిలిచి బర్త్‌డే కేకు కూడా కట్ చేయించారు. దారిపోయే ఆవును ఆదరించి, దానికి సపర్యలు చేసి వైద్య సదుపాయం అందించి ఆదరించడంపై వారిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. యజమాని అడ్డాడ రఘు మాట్లాడుతూ హిందువులు గోమాతను ప్రత్యక్ష దైవంగా భావించి పూజిస్తుంటారు. ఇటీవల కాలంలో రోడ్లు మీదకు ఆవులను వదిలివేయడం చూసి చాలా బాధపడేవాళ్లం. మా ఇంటి ఆవరణకు చేరిన ఆవును చేరదీశాం.. దాంతో మాకు అనుబంధం ఏర్పడింది. గోమాతకు మేము చేస్తున్న ఈ సేవ మా మనసుకు ఎంతో ఆనందాన్నిస్తోంది.. అని చెప్పారు..

ఆ..ఆనందం మాటల్లో చెప్పలేనిది



సొంత ఊరిలో అరంగేట్రం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే 11 ఏళ్ల పాటు కూచిపూడిలో శిక్షణ

సంతోష్ కుమార్‌తో ఆంధ్రజ్యోతి మాటా..మంతీ..

ఆయన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి...కళలపై ఆయనకు ఉన్న ఇష్టంతో ఒక పక్క ఉద్యోగం చేస్తూనే 11 ఏళ్లపాటు కూచిపూడి నృత్యం నేర్చుకున్నారు.. తన సొంత ఊరిలో అరంగేట్రం చేయాలని అనుకున్నారు.. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న వీరవాసరం మండలం నర్సన్న చెరువుపాలేనికి చెందిన మల్లుల సంతోష్ కుమార్ ఆదివారం కొణితివాడలోని ఉన్నత పాఠశాల్లో నృత్య ప్రదర్శన చేశారు. సొంత ఊరిలో నా అనుకునే వారి మధ్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో ఆనందం ఇచ్చిందని ఇది ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి అని సంతోష్‌కుమార్ అన్నారు... ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఆయనను పలకరించగా కళాకారుడిగా తన ప్రయాణం ఎలా సాగిందీ వివరించారు.. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

చిన్నప్పటి నుంచి ఇష్టం..

కొణితివాడలో చదువుకుంటున్న సమయంలోనే 12వ ఏట అదే గ్రామానికి గోవర్ధనం నరసింహాచార్యుల వద్ద కూచిపూడి నేర్చుకున్నాను. పాఠశాలల్లో ఫంక్షన్లలో నృతం చేసేవాడిని...అలా నృత్యంపై అభిమానంతో నేర్చుకున్నాను. అప్పట్లో పదో తరగతిలో మండలం ఫస్ట్ రావడంతో నూజివీడు ఐఐటీలో సీటు వచ్చింది. ఇంటర్, ఇంజనీరింగ్ అంతా అక్కడే చదువుకున్నా...దాంతో కొంతకాలం కళకు దూరం కావలసి వచ్చింది.

ఉద్యోగం వచ్చిన తరువాత..

బెంగళూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. మళ్లీ నాట్యంపై ఆసక్తి కలిగింది.. కూచిపూడి నేర్పేవారు ఎవరైనా ఉన్నారా అని వెతికే ప్రయత్నంలో వెంపటి మాస్టర్ శిష్యుడు ఉదయ్ కాంత్ శిక్షణ ఇస్తున్నారని తెలిసి అక్కడకు వెళ్లి అడిగాను.. ఆయన దగ్గర 11 ఏళ్ల పాటు నేర్చుకున్నా.. ఆయనతో కలిసి కర్ణాటక, కేరళ, తెలంగాణ ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్నాను. ఆనంద గణపతి, దశావతారాలు, బాలగోపాల తరంగం వంటి ప్రదర్శనలు ఇచ్చాను..

సహ ఉద్యోగులకు కూడా తెలియదు

నేను పనిచేస్తున్న కంపెనీలో ఎవరికి కళాకారుడునని, కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నానని తెలియదు. వీకెండ్ శనివారం, ఆదివారం శిక్షణ తీసుకునేవాడిని. అరంగేట్రం ఆహ్వాన పత్రికను మేనేజర్‌కు, తోటి ఉగ్యోగులకు ఇస్తే ఆశ్చర్యపోయారు. స్వయంగా టీమ్ మేనేజర్ దిలీప్‌కుమార్, సహ ఉద్యోగులు హరి, రాధాకృష్ణ ఇక్కడకు వచ్చి నా ప్రదర్శన చూశారు.. నా నాట్యం చూసి వారు వ్యక్తం చేసిన సంతోషం అంతులేనిది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

నరసన్న చెరువుపాలెంలో మాది సామాన్యమైన కుటుంబం. తండ్రి సత్యనారాయణ దర్జీగా పనిచేసేవారు.. తల్లి వెంకట లక్ష్మి ఇంటి వద్దనే ఉండేవారు. నా ఆసక్తిని చూసి నృత్యం నేర్చుకుంటున్నా ప్రోత్సహించేవారు. నాకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. నా భార్య శిరీషకు కూచిపూడి నృత్యంపై ఉన్న ఇష్టాన్ని చెప్పినప్పుడు తనకు అంతగా అవగాహన లేకపోయినా నేను చేస్తున్న నృత్యాల వీడియోలు చూసి ఆసక్తి పెంచుకుంది..ప్రోత్సాహం అందించింది.

పిల్లలకు నృత్యం నేర్పించాలి

నేటి తరం చిన్నారులకు నాట్యంపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా అవగాహన కల్పించాలన్నదే నా ఆశయం.. అరంగేట్రం తర్వాత చాలా మంది మా పిల్లలకు కూడా నేర్పుతారా..? ఎక్కడ నేర్చుకోవాలి? అని తల్లి తండ్రులు అడు గుతుంటే ఎంతో ఆనందం కలిగింది. ఇందుకోసం కృషి చేస్తా..

-భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి)



తోలేరులో ప్రారంభమైన నాటిక పోటీలు

వీరవాసరం, భీమవరం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా వీరవాసరం మండలం తోలేరులో సుబ్రహ్మణేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో 20వ జాతీయస్థాయి నాటిక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిగా సోమవారం రాత్రి చైతన్య కళాభారతీ కరీంనగర్ వారిచే ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటకం, తరువాత కత్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి కిడ్నాప్ నాటికలు ప్రదర్శించారు.

13 నుంచి నన్నయలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యూనివర్శిటీ అథ్లెటిక్ జట్టు ఎంపికలు ఈ నెల 13 నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఈ పోటీలను క్యాంపస్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉభయగోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్‌లలో 24 ఈవెంట్స్ మహిళలకు, పురుషులకు నిర్వహించనున్నామని తెలిపారు.



జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు శిక్షణ

పాలకొల్లు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో 49వ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించే ఎంపికైన వివిధ జిల్లాలకు చెందిన 17 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు. అంజలి , జాస్మిన్, బేబీ (చిత్తూరు), భువనేశ్వరి, డి.హాసిని, బి.ఆధ్య అక్షిత ,శంకరి (తూర్పు గోదావరి జిల్లా), ఎవి లక్ష్మీ అక్షయ, అక్షర (గుంటూరు జిల్లా), బి కుసుమ,వర్షిణీ, ఆర్.వాహిని (కృష్ణాజిల్లా), కెపి మందిర, హిమవర్ధిని (విశాఖ జిల్లా), శాంతి, సులోచన, మహేశ్వరి (పశ్చిమ గోదావరి జిల్లా)లకు కోచ్ జగదీష్ శిక్షణ అంద జేస్తున్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

మార్టేరులో బాస్కెట్‌బాల్ పోటీలు

పెనుమంట్ర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలం మార్టేరులో పదో అంతర జిల్లాల బాస్కెట్బాల్ టోర్నమెంట్లు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆసక్తిగా తిలకరించారు. మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కప్పు పేరిట క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. 72వ జన్మదిన జరుపుకుంటున్న మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు క్రీడల్లో రాణించి చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని క్రీడాకా రులను సూచించారు. క్రీడాపోటీలు నిర్వ హిస్తున్న వైబీపీ చైర్మన్ చిర్ల బాలాజీ రెడ్డి అభినందించారు.

ఫైనల్‌కు చేరిన జట్లు

అంతర్ జిల్లాల బాస్కెట్బాల్ టోర్నమెంట్లో పురుషులు స్త్రీల విభాగంలో ఉత్కంఠ భరితంగా



లీగ్ మ్యాచ్ నిర్వహించిన అనంతరం పురుషుల విభాగంలో 8 జట్లు, మహిళల విభాగంలో 6 జట్లు ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ పరిశీలకులు చక్రవర్తి తెలిపారు. పురుషుల విభాగంలో పశ్చిమగోదావరి- విశాఖపట్నం, తూర్పు గోదావరి- శ్రీకాకుళం, చిత్తూరు- అనంతపురం జిల్లాలు తలపడనున్నాయి. మహిళల విభాగంలో అనంతపురం -విశాఖ పట్నం, పశ్చిమ గోదావరి -తూర్పుగోదావరి, శ్రీకాకుళం- కడప జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరగనున్నాయని ఆయన తెలిపారు.



సుబ్రహ్మణ్యేశ్వరునికి వసంతోత్సవం

ద్వారకాతిరుమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుని వసంతోత్సవం శ్రీవారి క్షేత్రపురవీధుల్లో సోమవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని జరిగిన ఈ ఉత్సవంలో పల్లకీ వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించి అర్చకులు వసంతాలు సమర్పించారు. క్షేత్రపురవీధుల్లో ఊరేగించి వేడుకగా భక్తులపై వసంతాలు జల్లారు. మంగళవారం రాత్రి జరుగనున్న శ్రీపుష్పయాగోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.



ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ పాత కల్యాణ మండప ప్రాంతంలో సోమవారం తెలంగాణ రాష్ట్రంకు చెందిన బాలలు, మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఖమ్మం జిల్లా పెనబల్లి మండలం రామచంద్రరావు బంజర్‌కు చెందిన శ్రీసీతా రామా కోలాట బృందం పాల్గొంది.



వినాయక రూపంలో కొబ్బరికాయ !

ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలో పసల భాస్కరరావు అనే రైతు పొలంలో ఆదివారం మధ్యాహ్నం కొబ్బరి చెట్ల నుంచి కాయలు తీస్తుండగా ఒక చెట్టు నుంచి తీసిన కొబ్బరికాయల్లో వినాయకుని ఆకారం కనిపించింది.తొండం కలిగి పూర్తిగా వినాయకుని ఆకారం పోలి ఉండడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ కొబ్బరికాయకు బొట్లు పెట్టి పూజలు చేశారు..

- ఇరగవరం (ఆంధ్రజ్యోతి)

'కంచె' కలిసిరాలేదా..?

జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో వాస్తు మార్పులు

- ఇటీవలే దక్షిణ దిశలో కంచె తొలగింపు
- తాజాగా ఈశాన్యంలో మార్పులు



గతంలో దక్షిణం వైపు తొలగించిన ఇనుపకంచె

అమరావతి, గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓ పక్క సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి.. మరోపక్క తరుముకొస్తున్న కేసులు.. ఈ కలసి రాని కాలానికి వాస్తు దోషాలే కారణమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భావిస్తున్నట్లు ఉన్నారు. దీంతో ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో చకచకా వాస్తు దోషాలు సవరిస్తున్నారు. ఆ ఇంటి చుట్టూ ఉన్న ఇనుప కంచెను వాస్తుకు అనుగుణంగా మార్పు చేస్తున్నారు. గాలి కోసం అంటూ ఇటీవల దక్షిణ దిశలో కంచెను తీసివేశారు. సోమవారం తూర్పు-ఈశాన్యం వైపు కంచెలో కొన్ని వరుసలను తొలగించారు. తూర్పు ఈశాన్యం మూత వేసి ఉంచడం మంచిది కాదని వాస్తు పండితులు చెప్పిన నేపథ్యంలో ఈ దిద్దుబాట్లు చేస్తున్నారని సమాచారం. అయితే జగన్ ఇంటికి ఇలా వాస్తు మార్పులు చేయడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రజలెందుకు తిరస్కరించారో విశ్లేషించుకోకుండా ఆయన సాకులు వెతుక్కుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి నెపాన్ని ఇంటి వాస్తుపైకి నెట్టేస్తున్నారని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఇదే ఇంటిలో ఉండగా 2019లో ఆయన అధికారంలోకి వచ్చారని వారు గుర్తుచేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 13 నుంచి నిరసనలు

- కంటైనర్ వ్యవహారంలో సీబీఐ తీరుపై మోదీ, షాలకు ఫిర్యాదు చేస్తా: బొత్స



విశాఖపట్నం, విజయనగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై 13 నుంచి వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలోనూ, విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆయన సోదరుడు నివాసంలోనూ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలే అయినప్పటికీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాల కారణంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీపరంగా ఒక కార్యాచరణ రూపొందించాం. వర్షాలకు తడిచిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైంది. ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ 13న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తాం. ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరుతూ 27న విద్యుత్తు పంపిణీ సంస్థల ఎస్‌ఈలకు, డిస్కమ్‌ల సీఈఓలకు వినతిపత్రాలు అందజేస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరుతూ వచ్చే నెల 3న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వైసీపీ నేతలు భూ కబ్జాలకు పాల్పడినట్లు భావిస్తే విచారణ జరిపి ఎటువంటి చర్యలైనా తీసుకోవచ్చు. పోర్టులో సీజ్ చేసిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నాయని హడావుడి చేయడంతోపాటు ఇద్దరిని అరెస్టు చేసిన సీబీఐ.. ఇప్పుడు అందులో డ్రగ్స్ లేవని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉంది. దీనిపై నేను త్వరలోనే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాను కలిసి వినతిపత్రం అందజేస్తా' అని బొత్స తెలిపారు.

వైసీపీ అధిష్ఠానం ఒత్తిడితోనే అశ్లీల పోస్టులు

- పోలీసుల ఎదుట నోరువిప్పిన బోరుగడ్డ అనిల్

అనంతపురం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి వల్లే సోషల్ మీడియాలో అశ్లీల పోస్టులు పెట్టాల్సి వచ్చిందని ఆ పార్టీ నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి శనివారం కస్టడీకి తీసుకున్న అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు.. అనంతపురానికి ఆదివారం అర్ధరాత్రికి చేరుకున్నారు. కేసు గురించి సమగ్రంగా విచారించారు. తొలిరోజు తనకేమీ తెలియదని చెప్పిన బోరుగడ్డ.. సోమవారం కొంత నోరు విప్పినట్లు తెలిసింది. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు సంబంధిత వీడియోల ఆధారంగా (చంద్రబాబు, లోకేశ్, వారి కుటుంబ సభ్యులను దూషించినవి) విచారించారు. పదేపదే ప్రశ్నలు సంధించడంతో తాను వైసీపీ హైకమాండ్ ఆదేశాల మేరకే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టానని చెప్పినట్లు సమాచారం. 'నిన్ను ఆదేశించిన ఆ వ్యక్తి ఎవరు' అని ప్రశ్నించగా, ఆ విషయం గుర్తులేదని చెప్పినట్లు తెలిసింది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు సమాచారం. బోరుగడ్డ కస్టడీ సమయం ముగుస్తుండటంతో సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్ సాయంత్రం 4.30గంటలకు కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

పెట్రోల్ పోసి తగలబెట్టాడు!

- 17 ఏళ్ల బాలికపై ఉన్మాది ఘాతుకం
- ఘటనపై అనేక అనుమానాలు



కాలిన గాయాలతో రాఘవేంద్ర, (ఇన్‌సెట్‌లో) లహరి

నందికొట్కూరు/కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వెంటపడ్డాడు.. నిరాకరించడంతో ఉన్మాదిగా మారాడు. 17 ఏళ్ల బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బాలిక సజీవ దహనం కాగా.. యువకుడికి కూడా మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డినగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. మృతురాలు తల్లి, బంధువులు, పోలీసులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన ఇంజమూరి శివ రామకృష్ణ, లక్ష్మి దంపతులకు ఇంజమూరి లహరి (17) ఏకైక కుమార్తె. ఆమె పుట్టిన నెలకే తండ్రి శివరామకృష్ణ మరణించడంతో.. అమ్మ లక్ష్మి కూలి పనులు చేస్తూ లహరిని పెంచింది. పదో తరగతి వరకు రామళ్లకోటలో చదవిన లహరి.. అమ్మమ్మ, తాతయ్యల స్వగ్రామమైన నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఉంటూ స్థానిక కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి అవ్వతాతలు ఓ గదిలో పడుకుంటే.. బాలిక పక్క గదిలో నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున బాలిక కేకలు విని తాతయ్య పరుగున వచ్చాడు. గదిలోపల మనవరాలు మంటల్లో కాలిపోతుండటం, పక్కనే ఓ యువకుడు కూడా ఉంటడం చూసి షాకయ్యాడు. వెంటనే పోలీసులకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత లోపలి నుంచి బయటికొచ్చిన ఆ యువకుడిని స్థానికులు అడ్డుకున్నారు. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాఘవేంద్ర (21) అనే యువకుడే ప్రేమ పేరుతో అర్ధరాత్రి ఇంటికొచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని, ప్రేమించలేదనే అక్కసుతోనే తన కుమార్తెపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడని లహరి తల్లి లక్ష్మి కన్నీరు మున్నీరైంది. కాగా.. బాలికతోపాటు ఆ మంటల్లో చిక్కుకున్న రాఘవేంద్ర కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పదో తరగతి నుంచే బాలికను రాఘవేంద్ర ప్రేమ పేరుతో వేధిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం రాత్రి లహరితో ఫోన్లో మాట్లాడి అర్ధరాత్రి ఇంటికి వెళ్లి ఉంటాడని, ప్లాన్ ప్రకారం తనతో తీసుకెళ్లిన పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పుపెట్టి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్పీకి హోంమంత్రి అనిత ఫోన్

ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, నిందితుడికి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. కాగా, సంఘటనా స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాఘవేంద్ర, లహరి వెల్దుర్తి మండలంలో ఒకే పాఠశాలలో చదువుకున్నారన్నారు. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా? ఇద్దరూ ఆత్మహత్యకు ప్రయత్నించారా..? లహరిని రాఘవేంద్ర హత్య చేశాడా..? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణాల్లో విచారణ చేసి కారణాలు వెల్లడిస్తామని చెప్పారు. రాఘవేంద్ర నుంచి కూడా వివరాలు సేకరిస్తామని తెలిపారు.

లోన్ యాప్ వేధింపులు

- 2 వేల కోసం మార్ఫింగ్ చేసి బెదిరింపులు
- పెళ్లయిన 40 రోజులకే యువకుడు ఆత్మహత్య



నరేంద్ర (ఫైల్)

మహారాణిపేట (విశాఖపట్నం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఆన్‌లైన్ లోన్ యాప్‌లో కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. రూ.2వేలు మినహా మిగతా మొత్తం చెల్లించేశాడు. కానీ.. ఆ రెండు వేల కోసం లోన్ యాప్ నిర్వాహకులు వేధించడం మొదలుపెట్టారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి ఆ యువకుడికి తెలిసిన వాళ్లందరికీ పంపించారు. ఇటీవలే పెళ్లి చేసుకున్న ఆ యువకుడి భార్యకు కూడా పంపించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖ నగరంలోని మహారాణిపేటలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మహారాణిపేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన సూరాడ నరేంద్ర (21) ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివాహం జరిగి 40 రోజులైంది. దంపతులిద్దరూ చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నరేంద్ర లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకుని కొంత చెల్లించేశాడు. మరో రూ.2వేలు మాత్రమే బాకీ ఉంది. ఇటీవల ఆ డబ్బులు చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధించడం ప్రారంభించారు. అతడి భార్య ఫోన్‌కు మార్ఫింగ్ ఫొటోలు పంపి నరేంద్రతో వెంటనే డబ్బులు కట్టించాలని, లేకుంటే మరిన్ని ఫొటోలు పంపిస్తామని బెదిరించారు. హతాశురాలైన ఆమె ఏం జరిగిందని భర్తను నిలదీయగా.. లోన్ యాప్ వాళ్లకు రెండు వేలు చెల్లించాలని చెప్పాడు. తమ వద్ద ఉన్న రూ.2 వేలు వెంటనే చెల్లించేశారు. అప్పటికే యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ ఫొటోలను నరేంద్ర ఫోన్ కాంటాక్ట్ లిస్టులో ఉన్న వాళ్లందరికీ పంపించేశారు. దాన్ని తీవ్ర అవమానంగా భావించిన నరేంద్ర శనివారం అర్ధరాత్రి భార్య నిద్రలో ఉండగా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తల్లీబిడ్డలను కాటేసిన కరెంటు తీగ

- కొడుకును కాపాడబోయి తల్లి.. తల్లిని పట్టుకుని కుమార్తె
- విద్యుత్ షాక్‌తో ముగ్గురూ మృతి



ఇంటి ముందు విగత జీవులుగా పడి ఉన్న లక్ష్మి, సంతోష్, అంజలి

పెదబయలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెగిపడిన కరెంటు తీగపై కాలు వేసిన కొడుకుని కాపాడబోయి తల్లి, ఆ తల్లిని కాపాడబోయి కూతురు... ఇలా విద్యుత్ షాక్‌తో ముగ్గురూ మృతిచెందారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా పెదబయలు మండలంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామ శివారులో కొర్ర మోహనరావు కుటుంబం నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం మోహనరావు పెదబయలు వారపు సంతకు వెళ్లాడు. భార్య లక్ష్మి, నలుగురు పిల్లలు ఇంటి వద్ద ఉన్నారు. సుమారు 11 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటున్న వారి కుమారుడు సంతోష్ (13)... సమీపంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్‌ను గమనించకుండా దానిపై కాలు వేశాడు. సంతోష్ గిలగిలా కొట్టుకుంటూ పడిపోవడంతో అక్కడే ఉన్న తల్లి లక్ష్మి (36)... ఏమైందంటూ అతడిని పట్టుకుంది. దీంతో ఆమె కూడా షాక్‌కు గురైంది. తల్లి, సోదరుడికి ఏం జరిగిందోననే కంగారులో కుమార్తె అంజలి (10) కూడా వారిని తాకడంతో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. మరో ఇద్దరు పిల్లలు కూడా ఇంట్లో నుంచి బయటకు వచ్చి తల్లి వద్దకు వెళుతుండగా అటువైపుగా పశువులు తోలుకెళ్తున్న కోటేశ్వరరావు చూసి వారిని ఆపేశాడు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. కానీ, అప్పటికే ముగ్గురూ చనిపోయారు.

ఆర్జీవీ బెయిల్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఆయనపై శుక్రవారం వరకు పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని పేర్కొంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఆయనపై ప్రకాశం జిల్లా మద్దిపాడుతోపాటు రాష్ట్రంలో మరో 8 ప్రాంతాల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు హాజరు కావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవీకి నోటీసులు ఇచ్చారు. అదే సమయంలో వర్మ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారానికి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

మోహన్‌బాబు యూనివర్సిటీలో

జర్నలిస్టులపై బౌన్సర్ల దాడి

చంద్రగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద వీడియో కవరేజ్‌కు వెళ్లిన ఇద్దరు మీడియా ప్రతినిధులపై బౌన్సర్లు, సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారు. దీనిపై బాధితులతో కలిసి జర్నలిస్టు నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. సుమన్ టీవీ తిరుపతి ప్రతినిధి ఉమాశంకర్, కెమెరామెన్ నరసింహులు శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద వీడియో కవరేజ్ చేస్తున్నారు. వీడియో తీయొద్దంటూ అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఎంబీయూ పీఆర్వో సతీశ్.. మీడియా ప్రతినిధుల వద్దకు వచ్చి మాట్లాడుతుండగా, ఇద్దరు బౌన్సర్లు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు వచ్చి దాడి చేశారు. ఫైబర్ లాఠీతో కొట్టారు. మీడియా ప్రతినిధులు పరుగు తీస్తుండగా, వారితో పాటు మరి కొంత మంది స్థానికులు వచ్చి బలవంతంగా విద్యానికేతన్‌లోకి లాక్కెళ్లారు. వారి సెల్‌ఫోన్, కెమెరాలను ధ్వంసం చేశారు. బాధితులు చంద్రగిరి సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళీ, కార్యదర్శి బాలచంద్ర, ఇతర జర్నలిస్టులు చంద్రగిరి వచ్చారు. బాధితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కృత్రిమ మేధతో అనేక ప్రయోజనాలు

మణిపూర్ నిట్ డైరెక్టర్ సోమయాజులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధతో అన్ని రంగాల్లో అనేకమైన ప్రయోజనాలు సమకూరుతున్నాయని విద్యార్థుల సాంకేతిక ప్రమాణాలు పెంపొందుతున్నాయని మణిపూర్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీఎల్ఎన్ సోమయాజులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో జాతీయ విద్యావిధానం 2020 ప్రాముఖ్యత, కృత్రిమ మేథ అంశాలపై ఆచార్యులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్ది రోజుకో కొత్త యాప్ వస్తుందని పరికరాలు పరిచయం అవుతున్నాయన్నారు. ఐఐటీ మాజీ డైరెక్టర్ ఎన్‌వి ఎస్ఎన్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఆచార్యులు పాఠాలు బోధించాలన్నారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సమయంలో విద్యార్థులను ప్రశ్నించడంతోపాటు చిత్రాల ద్వారా బోధన సాగాలన్నారు. రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకరరెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్ రమణారావు ముఖ్యఅతిథులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

ఆలయంపై వేసిన కేసు ఉపసంహరించాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం సౌత్ పంచాయతీ పరిధిలోని రాజులపాలెం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోని అన్ని మతాలకు చెందిన వారు ఏకమై సత్తెమ్మ ఆలయం వద్ద ఆందోళనకు దిగి అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. దాదాపు 100 ఏళ్లుగా గ్రామస్థులు పూజిస్తున్న అమ్మవారి ఆలయాన్ని తొలగించాలని కోర్టులో వేసిన పిటీషన్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సీహెచ్ సత్యవరప్రసాద్‌కు అల్టిమేటం ఇచ్చారు. 72 గంటల్లో ఉపసంహరించుకోకపోతే అందరం ఏకమై ఆందోళన చేపడతామన్నారు. దీనిపై ఎస్పీ, కలెక్టర్, సబ్‌కలెక్టర్, డీఎస్పీలకు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ఇటువంటి చర్యలకు వరప్రసాద్ పాల్పడుతున్నాడంటూ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్, కలవకొలను తాతాజీ, కూనపరెడ్డి ఏసు, పీవీఆర్, కొండవీటి త్రినాథ్, కస్తూరి రంగ, బర్రె శంకర్, వర్మ, ఇంటి మురళీ, గణపతిరాజు, సుబ్బరాజు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు: సీఐ

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే పుట్టిన నవజాత శిశువు మృతదేహం ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు అశోక్ నగర్‌లోని ఒక నవజాత శిశువు మృతదేహం ఉందని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేయగా సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో ఉన్న బాలిక డెలివరీ అయినట్లు గుర్తించామన్నారు. 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ఆమెకు డెలివరీ జరిగిందని ఆమె పరిస్థితి క్షీణించడంతో వెంటనే ఆసుపత్రికి తరలించామన్నారు. ఆ శిశువు మరణానికి కారణాలు తెలుసుకోవడానికి పోస్టుమార్టం జరిపిస్తున్నామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కొన్ని సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కొంతమంది ఊహాగానాలతో దర్యాప్తునకు ఆటంకం కలిగించేలా వ్యాఖ్యానం చేస్తూ దర్యాప్తును పక్కదారి పట్టించేలా ప్రచారం జరుగుతుందన్నారు. ఏదైనా అనుమానాలు ఉంటే తనను సంప్రదించాలని సీఐ వైవి రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర విచారణ చేయండి



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్రబాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, సభ్యులు రాజేంద్రప్రసాద్

ఏలూరు అశోక్‌నగర్‌లో ఉన్న మిషనరీ వసతి గృహం నుంచి ఓ శిశువును బయటకు విసిరేసిన సంఘటనపై రాష్ట్రబాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ స్పందించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదికను మూడు రోజుల్లో రాష్ట్ర కమిషన్‌కు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ సంఘటనను సుమోటోగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్వీకరించి ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులపై శాఖాపరమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. వసతి గృహం సిబ్బంది, తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరు విధిగా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని వారు తెలిపారు.



మహాధర్నాలో ఐక్యత చాటుతున్న యూనియన్ నేతలు

ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకున్న జీవిత బీమా సంస్థ యాజమాన్యవైఖరిని నిరసిస్తూ రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద లియాఫి(అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య) ఆధ్వర్యంలో మహాధర్నా చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఏజెంట్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు.యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ దేశంలో 14 లక్షల మంది ఏజెంట్ల మనుగడకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యం ప్రవర్తించడం సరికాదన్నారు. పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బందులు వస్తాయన్నారు.ఎల్ఐసీ సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉన్న పాలసీలన్నింటిని క్లోజ్ చేసి అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీలను ప్రవేశ పెట్టడం జరిగిందని అందులో ఏజెంట్లకు కష్టమర్లకు ఇబ్బంది కలిగించే విషయాలను పొందుపర్చడం జరిగిందన్నారు. క్లా బ్యాక్ కమిషన్ స్ట్రెక్చర్‌ని మార్చడం, మినిమం బీమా మొత్తం రూ.2 లక్షలకు పెంచడం, పాలసీల్లో వయోపరిమితిని తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచడం జరిగిందని వీటన్నింటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈసీ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ తమ హక్కుల సాధన కు ఉద్యమిస్తున్నామని త్వరలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు, పాలకొల్లు, రావులపాలెం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం నుంచి 3 వేలమంది ఏజెంట్లు పాల్గొన్నారు.

18వ తేదీ వరకు ఉండి రైల్వే గేటు మూసివేత

ఉండి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఉండిలో రైల్వేగేటును మూసివేశారు. రైల్వేగేటు నుంచి రైల్వే బ్రిడ్జి అవతల వరకు పనులు చేస్తున్నారు. భీమవరం నుంచి ఉండి మీదుగా ఏలూరు, కైకలూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు పనులు జరుగుతాయని పోలీసులు తెలిపారు.



రైల్వే మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

ఫంగస్ అధరహో !

- కేజీ చేప ధర రూ.85
- రెండు కేజీల చేప ధర రూ.180
- రైతు కళ్లల్లో ఆనందం
- నష్టాల సాగు నుంచి గట్టెక్కనున్న చేప రైతు

నిడమర్రు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆక్వా రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. మార్కెట్‌లో ఫంగస్, రూప్‌చంద్ రేట్లు పెరగడంతో చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. సాధారణంగా ఫంగస్ చేపలకు మార్కెట్ జనవరి నుంచి మే నెల వరకు అత్యధిక ధర పలుకుతుంది. జూన్, జూలైలో సముద్రం చేపలు సంవృద్ధిగా లభించడం, పండుగల వల్ల ఈ కాలంలో ధర తక్కువగా ఉంటుంది. కానీ నేడు ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేజీ ఫంగస్ చేపల సాగుకు రైతుకు అన్నీ కలిపి సుమారు 70- 75 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం కేజీ రూ.85 పలుకుతోంది. దీంతో రైతుకు రూ.15 నుంచి రూ.20 గిట్టుబాటు అవుతుంది.

గత ప్రభుత్వ హయాంలో అంతానష్టమే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్త ప్రభుత్వ విధానాల ఫలితంగా చేపల మేత ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఓ పక్క అధిక విద్యుత్ ధరల భారం ఇతర ఖర్చులు పెరగడంతో పాటు మార్కెట్ ట్రేడర్లు చేపల ధరలు తగ్గించి కొనుగోలు చేసేవారు. కంపెనీల తరపున అనధికారికంగా అప్పటి కొందరు అధికార పార్టీ పెద్దలకు మామూళ్ళు ఇవ్వాల్సి రావడంతో మార్కెట్ రేటు బాగున్నా రైతుకు గిట్టుబాటు ధరను ట్రేడర్స్ ఇవ్వలేకపోయేవారు. నేడు కూటమి ప్రభుత్వం రాకతో మామూళ్ల బెడద తొలగి పోవడంతో ట్రేడర్స్ స్వేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తూ రైతుకు మార్కెట్ ధరనే ఇవ్వడతో రైతులు లాభాల బాట పట్టారు.



తగ్గిన ఫంగస్ సాగు

గత ప్రభుత్వ విధానాల వల్ల ఫంగస్ సాగు పూర్తిగా తగ్గిపోయింది. పదెకరాల కన్నా ఎక్కువ ఉన్న చెరువులకు ఆక్వా విద్యుత్ సబ్సిడీ లేకపోవడంతో బిల్లులు వేలాది రూపాయలు రావడంతో రైతులు బెంబేలెత్తి పోయి తమ చెరువులను చిన్న చెరువులుగా చేసి రొయ్యల సాగు ప్రారంభించారు. కానీ రొయ్యల సాగులోను తీవ్ర నష్టాలు రావడంతో ముందుకు సాగలేక చతికిల పడ్డారు. దీంతో ఫంగస్ చెరువుల సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు ధర లేకపోవడంతో సాగు తగ్గించివేశారు. చాలామంది రైతులు తమ చెరువులను అయినకాడికి లీజులకిచ్చేశారు. నేడు ప్రభుత్వ విధానాలు మారడం, చేపల ధరలు పెరగడంతో మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆశ పడుతున్నారు.

ఫంగస్ చేప తయారీ అయ్యే ఖర్చు

చేపపిల్ల ఖరీదు (5 అంగుళాలు)	రూ.5
చెరువులో నీటి తోడకం	రూ.10
మేత ఖర్చు	రూ.40
విద్యుత్ ఖర్చు	రూ.5
చెరువు లీజు ఖర్చు	రూ.5
ఇతరాలు ఖర్చు	రూ.5
మొత్తం ఖర్చు	రూ.70

రైతుకు లాభాల బాట

పూసల వెంకటేశ్వరరావు ఆక్వా రైతు, చిలకంపాడు



గత ప్రభుత్వ హయాంలో కొన్ని విధానపర లోపాల వల్ల ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. చేపల సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. నేడు కూటమి ప్రభుత్వంలో మార్కెట్‌లో నిలకడ వచ్చి చేపల రేట్లు పెరగడంతో రైతు లాభాల బాట పట్టాడు.

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

తెలగారెడ్డి వెంకటేశ్వరరావు, గణపవరం



ఫంగస్‌కు మేలో పలికే ధర డిసెంబరులో రావడం ఆనందంగా ఉంది. చితికి పోయిన ఆక్వా రంగాన్ని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నూతన మత్స్య విధానం ద్వారా ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి.

అభయారణ్యంలో చేపల చెరువులు

అక్రమ విద్యుత్ కనెక్షన్లుపై జేసీకి ఫిర్యాదు

ఏలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంటూరు పరిధిలో లేని చెరువు లపేరుతో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని అక్కడి నుంచి కరెంటువైర్ల ద్వారా కొల్లేరు అభయా రణ్యం పరిధిలో ఉన్న చేపల చెరువులకు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ చేపల సాగు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి కె.తులసి ధర్మతేజ, పలువురు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఏలూరు రూరల్ మండలం, పెదపాడు ప్రాంతాల్లో కొల్లేరు అభయారణ్య పరిధిలో అక్రమ చేపలచెరువులు తవ్వారని వాటిలో చేపలు సాగుచేస్తున్న చెరువులకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా చేపలసాగు చేస్తున్నారని జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. కాంటూరు పరిధిలో లేని చెరువుల పేరుతో విద్యుత్‌కనెక్షన్ తీసుకుని వైర్లుద్వారా అభయారణ్యపరిధిలో ఉన్న చేపల చెరువులకు విద్యుత్ వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ విద్యుత్‌వైర్లు చేపలచెరువు గట్లమీద నుంచి వేయటం వల్ల కొల్లేరులోకి ఆహారం కోసం వచ్చే పశువులు విద్యుత్‌వైర్లు తగిలి షాక్‌కు గురై చనిపోతున్నాయన్నారు. గతవారం రూరల్ మండలం చాటపర్రులో పట్టాభూముల నుంచి అభయారణ్యపరిధిలో ఉన్న చేపల చెరువుకు విద్యుత్‌కోసం వైర్లు ఏర్పాటుచేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఒక యువకుడు మృతిచెందాడని జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ కనెక్షన్ల పై చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదని జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. రూరల్ మండలంలో కలకుర్రు గ్రామంలో అక్రమ విద్యుత్‌కనెక్షన్‌ల పై స్థానిక విద్యుత్‌శాఖ అధికారి ఓ వ్యక్తిపై చర్యలు తీసుకుని సుమారు లక్షా70వేలు జరిమానా విధించారని కలకుర్రు గ్రామంలో అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టుకున్న సుమారు ఏడుగురిపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ విద్యుత్‌కనెక్షన్లు పెట్టకుండా చెరువులకు ఇచ్చే సబ్సిడీ కరెంటు దుర్వినియోగం కాకుండా చూడాలని, ప్రస్తుతం పత్తికోళ్లలంక, గుడివాకలంక, శ్రీపర్రు, మొండికోడు, పైడిచింతపాడు, కొక్కిరాయలంక, పెదపాడు మండలం వడ్డిగూడెం, గుడిపాడు గ్రామంలో ఉన్న అక్రమ చేపల చెరువుల పైకి విద్యుత్‌కనెక్షన్ పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకుని కనెక్షన్ తొలగించాలని విజ్ఞప్తి చేశారు.





చెరువులు మీదుగా కరెంటు వైర్లు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాక్టరీ సమీపంలోని ప్రజలు

గోవధ పరిశ్రమ మూసివేయాలంటూ ధర్నా

ఇరగవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తణుకులో ఉన్న లెహం ఫుడ్ ప్రొడెక్ట్ (గోవధ) పరిశ్రమను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ మహాలక్ష్మి నగర్, అండర్ బైపాస్, కొండలమ్మ పుంతకు చెందిన మహిళలు తణుకు ఎంఆర్‌వో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ డీవీఎస్ అశోక్ వర్మని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసనతో అక్కడ నివసించలేకపోతున్నామని మహిళలు ఆవేదన చెందారు. పరిశ్రమలో గోవధ జరుగుతుందని, విపరీతంగా అక్కడి నుంచి దుర్వాసన వస్తుందని, పరిశ్రమను అక్కడి నుంచి తొలగించకపోతే తాము అనారోగ్యాల పాలైపోతామని వాపోయారు. వర్మ మాట్లాడుతూ లెహం ఫుడ్ ప్రొడక్ట్ పరిశ్రమకు ఏ అనుమతులు ఉన్నాయో తానే స్వయంగా వెళ్ళి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్రైమ్ కార్నర్

మోటార్ సైక్లిస్ట్ మృతి

ఉండి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోటర్ సైక్లిస్టు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన గంటి దుర్గారావు(38) ఈనెల 7వ తేదీ ఉండి మండలం ఎన్ఆర్‌పిఅగ్రహారం వద్ద గోతిలో మోటార్‌సైకిల్‌తో వెళ్లి పడిపోయాడు. ఈప్రమాదంలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని భార్య మీయామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్త, మామలు, వారి బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం రెండవ పట్టణానికి చెందిన నంబూరి లక్ష్మీ దీప్తి టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. లక్ష్మీదీప్తికి సునీల్ వర్మతో 2018 సంవత్సరంలో వివాహమైంది. వివాహ సమయంలో 10 ఎకరాల పొలం, రూ.10 లక్షల నగదు, 40 కాసుల బంగారం ఇచ్చి వివాహం చేశారు. 2019లో వారికి ఆడపిల్ల జన్మించింది. అనంతరం ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గత కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులు రావడంతో పెద్దల సమక్షంలో పెట్టినా సమస్య పరిష్కారం కాకపోవడంతో పోలీసులకు నలుగురిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహ్మాన్ తెలిపారు.

అత్తపై కోడలు దాడి

భీమవరం క్రైం, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : తన కోడలు సెల్‌ఫోన్‌తో తలపై కొట్టిందంటూ రాయలం గ్రామానికి చెందిన ఒక మహిళ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం తన మూడవ కోడలు గర్భం రాకుండా ట్యూబ్ వేయించుకుందని ట్యూబ్ తీయించి పిల్లల్ని కనాలని కోరడం కోసం ఆదివారం మధ్యాహ్నం అత్త కోడలు వద్దకు వెళ్ళింది. ఇద్దరి మధ్య ఘర్షణతో కోడలు సెల్‌ఫోన్‌తో నుదుటిపై కొట్టడంతో గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రి సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రూ.లక్ష విలువైన బంగారు వస్తువులు స్వాధీనం



దొంగల్ని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న సీఐ రజనీ కుమార్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్య తేజానగర్‌లో ఇటీవల రెండు ఇళ్ళల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు లక్ష రూపాయల విలువైన నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ కె.రజనీ కుమార్ తెలిపారు. సీఐ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్య తేజనగర్‌లో నివాసం ఉంటున్న కాపవరపు వరలక్ష్మీదేవి నివాసంలో ఇంటితాళాలు పగలకొట్టి సుమారు 2 లక్షల విలువైన బంగారు వస్తువులు, అదే ఇంటిలో మరో పోర్షన్‌లో నివసిస్తున్న పుల్లేటి కుర్తి లలితా శివ జ్యోతి ఇంటిలో వెండి వస్తువులు చోరీ చేయడంతో పోలీసు లకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం మధ్యాహ్నం అనుమానా స్పదంగా సంచరిస్తున్న మొగల్తూరు మండలం కెపిఎస్ పాలెంకు చెందిన గుబ్బల శ్రీను, భీమవ రం పట్టణంలోని లంకపే టకు చెందిన రావాడ శ్రీనులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి లక్ష విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల వద్ద ఉన్న ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితు లను పట్టుకోవడంలో ఎస్ఐ పృథ్వీ, కాని స్టేబు ల్స్ ఎస్.మణికంఠ, వై. శ్రీదర్, సుబ్ర హ్మణ్యం సహకారం అందించారని సీఐ



పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న అభయ మహిళా రక్షకదళం

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం వేగవరం గ్రామానికి చెందిన కె.సూరమ్మ విజయవాడలోని రామవరప్పాడులో నాన్‌స్టాప్ బస్సు ఎక్కి సోమవారం సాయంత్రం ఏలూరు కొత్త బస్టాండ్‌లో దిగింది. తన చంటి బిడ్డ మరో రెండు బ్యాగ్‌లు ఉండడంతో హ్యాండ్‌బ్యాగ్‌ను మర్చిపోయింది. ఆ బ్యాగ్‌లో బ్యాంక్ బుక్, కొంత నగదు ఉండడంతో చివరకు వేగవరం వెళ్లడానికి కూడా చార్జీలు కూడా లేవని ఏడుస్తూ ఉండడంతో కొంత మంది విద్యార్థులు ఆమె పరిస్థితిని గమనించి అభయరక్షక దళానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా వచ్చి ఆమె చెప్పిన గుర్తుల ఆధారంగా బస్సులను తనిఖీ చేసి ఆ బస్సులోని వెనుక సీటులో బ్యాగ్ ఉండడంతో ఆ బ్యాగ్‌ను తీసుకువచ్చి సూరమ్మకు అందించారు. దీంతో ఆమె కళ్ళల్లో ఆనంద బాష్పాలు విరిశాయి. పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రక్షక దళ మహిళా కానిస్టేబుళ్ళు సుజాత, దేవి, శిరీష, నాగలక్ష్మి కానిస్టేబుల్ బాలు బస్సులు తనిఖీ చేసి బ్యాగ్‌ను కనుగొన్నారు.

మహిళల్ని ఢీకొన్న స్పోర్ట్స్ బైక్



ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ బైక్‌ను ఒక యువకుడు మరో ఇద్దరు యువకులను ఎక్కించుకుని అతి వేగంగా నడుపుతూ ఒక స్కూటర్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై ఉన్న ఇద్దరు మహిళలు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన నాగమణి (27), సీత (40)లు స్కూటర్‌పై సోమవారం సాయంత్రం వెళ్తుండగా అకస్మాత్తుగా అతి వేగంగా స్పోర్ట్స్ బైక్ వచ్చి ఢీకొంది. సీత, నాగమణి తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు స్పోర్ట్స్‌బైక్‌ను అక్కడే వదిలి వేసి ఆ బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు పరారీ అయ్యారు. నాగమణి, సీతల పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఏలూరు ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నాలుగు కాసుల బంగారం అపహరణ

నరసాపురం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గొంది గ్రామంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఎస్. రామకృష్ణ శనివారం కుమార్తె ఇంటికి వెళ్లాడు. ఆదివారం వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన నాలుగు కాసుల బంగారం, మూడు జతల వెండి పట్టీలు, రూ.5వేల నగదును దుండగు లు ఎత్తుకుపోయారు. పోలీసులకు సమాచారం తెలిసిన వెంటనే క్లూస్ టీంను రంగంలోకి దించారు. గత నెలలో ఈ గ్రామానికి సమీ పంలో ఉన్న చిట్టవరం గ్రామంలో చోరీ జరిగింది. ఆదే రీతిలో తాళం వేసిన ఇంట్లో మరో చోరీ జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సురేశ్ తెలిపారు.

వివాహితపై అత్యాచార యత్నం

ద్వారకాతిరుమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టపంగిడిగూడెంకు చెందిన ఓ వివాహిత త న భర్త నుంచి వేరుపడి అత్తతో కలిసి ఉంటోంది. ఆమె ఆరోగ్యం బాగోకపోవడంతో సోమవారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పంగిడిగూడెంలో బస్సు దిగి నడుచుకుంటూ స్వగ్రామానికి వెళ్తోంది. ఇదే సమయంలో మెట్టపంగిడిగూడెంకు చెందిన వీరవల్లి అంజిబాబు ద్విచక్ర వాహనంపై వచ్చి తనను తన గ్రామానికి తీసుకెళ్తానని బండి ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లగానే రూటు మార్చి అరటి తోటల్లోకి బలవంతంగా లాక్కుని వెళ్లి అత్యాచారం చేయబోయాడు. అతని నుంచి తప్పించుకుని పారిపోతున్న తన వెంటపడి చంపేస్తానని బెదిరించిన అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతోంది. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కైకరంలో ఆర్డీవో పర్యటన

ఉంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కైకరం వద్ద జాతీయ రహదారిపై నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ నిర్వాసితులతో సోమవారం ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ మాట్లాడారు. తాము కోర్టును ఆశ్రయించామని, జడ్జిమెంట్ రిజర్వ్‌లో ఉందని ఆర్డీవో దృష్టికి నిర్వాసితుల తరఫున వి.కృష్ణారావు తీసుకువచ్చారు. సంబంధి త పత్రాలను, కోర్టులోని స్థితిని నేషనల్ హైవే అథారిటి ఉన్నతాధికారులకు కాపీలు అందించాలని ఆర్డీవో కోరారు.

ఫ్రై డే డ్రై డేపై అవగాహన

పెదపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా కంటే దోమల సంఖ్య ఎక్కువగా ఉందని, దోమలు కుట్టడం వల్లే వ్యాధులు సంక్ర మిస్తున్నాయని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తెలిపారు. వట్లూరు పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది దోమల వల్ల వ్యాప్తి చెందే రోగాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీని నిర్వహించారు. డాక్టరు భారతి, సరళ, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

90 కిలోల లడ్డూ ప్రసాదం అందజేత

ఉంగుటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కైకరంలోని షష్టి ఉత్సవాలలో భాగంగా టి.సత్యనారాయణ కుమారులు ముత్య కుమార్, పట్టాభిరామయ్య 90 కిలోల లడ్డూను స్వామికి ప్రసాదంగా అందించారు. చివరి రోజున భక్తుల సమక్షంలో లాటరీ తీసి విజేతను ప్రకటిస్తామని ఆలయ నిర్వాహక కమిటీ తెలిపింది. అలాగే ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఒక్కసారిగా కైకరం షష్టిలో షాపింగు పెరిగింది. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన కటౌట్‌లు విశేషంగా ఆకట్టు కుంటున్నది.

చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 8న జరిగిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కోచ్, డైరెక్టర్ ఎ.సరళామాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-16 బాలికల విభాగంలో ఎం.తన్మయి ప్రథమ స్థానం, అండర్-10 బాలుర విభాగంలో పెన్మత్స సాధిక్ వర్మ 5వ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో పీడీ నాగసాయి, అశ్లేష్ 9వ స్థానం సాధించినట్లు సరళా మాధవి తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేత

బుట్టాయగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమయోగంలో కంఠస్థ పోటీలను జంగారెడ్డిగూడెం వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. బుట్టాయగూడెంకు చెందిన విద్యా రోహిణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయిలో బహుమతులు సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సోమవారం ఎంపీడీవో కె.జ్యోతి సర్టిఫికేట్లను, నగదు బహుమతిని అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలి

కామవరపుకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల పరిష్కారానికై గ్రామాల్లోని వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని కామవరపుకోట తహసీల్దార్ గెద్దం ఎలీషా పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా కూడా ఆక్రమణలు జరగకుండా చూడాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వీఆర్వోలు రాటాలు, ప్రభాకర్, రమేష్, నాగయ్య ప్రవల్లిక, లక్ష్మీ ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదు చేసేందుకు వస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని విసుగు చెందిన ఏలూరు రాణీనగర్‌కు చెందిన కొందరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం రాత్రి ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళ్తితే.. ఏలూరు టూ టౌన్‌లోని ఓ ఎలక్ట్రానిక్ దుకాణంలో రాణీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బ్యాటరీ కొన్నాడు. ఆ బ్యాటరీ సరిగా పనిచేయకపోవడంతో సోమవారం ఆ దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ దుకాణం యజమాని, సిబ్బందికి వీరికి మధ్య గొడవ జరిగింది. దీంతో దుకాణం యజమానిపై కేసు నమోదు చేయాలంటూ వీరంతా టూ టౌన్‌కు వచ్చి ఆందోళన చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు వీరిని ప్రక్కకు తీసుకువెళ్లి వివరాలు తెలుసుకుని ఫిర్యాదు తీసుకున్నారు.

వివాహిత మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒక వివాహిత ఎలుకల మందు పేస్టుతిని చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం మొండికోడుకి చెందిన అగ్గిబాదల నందిని (24)కు ఆరేళ్ళ కితం నిడమర్రుకు చెందిన తాడిపర్తి వెంక ట్రావుకిచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. తమ తల్లిదండ్రులు నిర్వహిస్తున్న కిరణా కొట్టు చూ స్తుంది. భర్తపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టింది. అయితే రెండు నెలల క్రితమే ఆ కేసు పరిష్కరించారు. ఆమె తిరిగి కాపు రానికి వెళ్ళే విధంగా చక్కబెట్టారు. ఆమె తల్లిదం డ్రులు సంక్రాంతి పండుగకు పిలిచి అల్లుడుకి వస్త్రాలు పెట్టి గౌరవ మర్యాదలతో పంపిస్తామని నందినికి సూచించారు. అయితే ఆమె వెళ్లిపోతా నని అనడంతో వారు మరోసారి అదే విధంగా చెప్పారు. దీంతో మనస్థాపానికి గురైె ఆమె ఈనెల 3న వారి కిరణా షాపులోని ఎలుకల మందును తినేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఒకప్పుడు వైద్యం కావాలంటే చింతలపూడి పెద్ద ఆస్పత్రి ఉందని భరోసాతో వచ్చేవారు. అప్పటి డాక్టర్ల సేవలు అదేవిధంగా ఉండేవి. పలానా డాక్టర్‌గారు ఉంటే మనకు భయంలేదంటూ దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు. 1987లో అప్పటి ఎన్టీఆర్ ప్రభుత్వం 30 పడకల ఆస్పత్రిగా మార్చింది. 2013లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి వంద పడకల ఆస్పత్రి మంజూరు చేసి నిధులు కేటాయించారు. నిర్మాణం చేపట్టకపోవడంతో 2020లో రీఎస్టిమేట్‌తో రూ.23 కోట్లతో నిర్మాణాలు ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే రోషన్ కుమార్ నిర్మాణంలో ఉన్న భవనాల తీరును పరిశీలించారు. నవంబరు నాటికి పూర్తి చేస్తారని అధికారులు చెప్పినా ఇంకా నిర్మాణ దశలోనే ఉంది.

ఏరియా ఆస్పత్రికి
సమస్యల సుస్తీ

» డాక్టర్లు ఉండరు » పాత భవనాల్లోనే కొనసాగింపు





సౌకర్యాలు లేని పాత భవనాల్లోనే కొనసాగుతున్న ఏరియా ఆస్పత్రి, నిరుపయోగంగా ఉన్న పరికరాలు

చింతలపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేరుకే చింతలపూడి ఏరియా ఆస్పత్రి.. అక్కడ ఆ స్థాయి సేవలు మాత్రం ఉండవు. గత వైసీపీ ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రికి రూ.23 కోట్లు మంజూరు చేసి భవనాలు పూర్తి చేయకుండా తాత్కాలికమంటూ సామాజిక ఆస్పత్రినే ఏరియా ఆస్పత్రిగా మార్చి పాత భవనంలోనే సేవలు కొనసాగిస్తున్నారు. ఏరియా ఆస్పత్రి స్థాయికి తగ్గ డాక్టర్లు ఉండరు. ఇన్‌పేషెంట్లకు బెడ్‌లు ఉండవు. వైద్య పరికరాలు ఉపయోగంలో ఉండవు. ఏరియా ఆస్పత్రిలో 23 మంది డాక్టర్లు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. నర్సులు మాత్రం 24 మంది ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్ రెండు, జూనియర్ అసిస్టెంట్ ఒకటి, సూపరింటెండెంట్ ఒకటి, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, థియేటర్ అసిస్టెంట్, మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంబులెన్సు సౌకర్యం లేదు. ప్రైవేటు అంబులెన్సులు నాలుగైదు ఆస్పత్రి బయట సిద్ధంగా ఉంటాయి. ఇక్కడకి వచ్చే ప్రతీ కేసు ఏలూరు ఆస్పత్రికి రిఫర్ చేస్తుంటారు. గత ఏడాది పరిశీలిస్తే సుమారు 800లకుపైగా కేసులు వైద్య సేవలు అందుబాటులో లేక రిఫర్ చేశారు. ఇక ప్రైవేటు అంబులెన్సుల దోపిడీని అదుపు చేయడం సాధ్యంకాదు. ప్రాణం పోయినా మాకేంటి అనే రీతిలో డిమాండ్ చేస్తుంటారని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఆస్పత్రికి నిత్యం 600 మందికిపైగా అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇక్కడ 30 పడకలకే సౌకర్యం ఉంది. మహాప్రస్థానం, తల్లీబిడ్డల వాహనాలు ఆవరణలోనే ఉన్నా ఉపయోగించడంలేదు. పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చే వారికి సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం లేదా ఏలూరు తీసుకువెళ్ళాలని చెబుతుంటారని రోగులు చెబుతుంటారు. ఆపరేషన్ థియేటర్ ఉన్నా ఉపయోగించడంలేదని సమాచారం. ప్రధానంగా ఈ ఆస్పత్రికి మహిళా పేషెంట్లు ఎక్కువగా వస్తుంటారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ ఏరియా ఆస్పత్రి ఉందని పరుగులు పెట్టి వచ్చేవారికి ఎమర్జన్సీ సర్వీసులు ఉపయోగపడడంలేదు. ప్రతీది రిఫర్ చేస్తున్నారు. గైనకాలజి, పెడియాట్రిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ ఎక్కువగా వస్తుంటాయి. గైనకాలజి డాక్టర్ లేకపోవడంతో జంగారెడ్డిగూడెం, నూజివీడు ఏరియా ఆస్పత్రి నుంచి వారానికి రెండు రోజులు చొప్పున నెలలో ఎనిమిది రోజులు మాత్రమే డిప్యూటేషన్‌పై వస్తుంటారు. వారు వచ్చే రోజు తెలుసుకుని రోగులు వేచి ఉండాలి. ఆర్థోపెడిక్ డాక్టర్ ఉన్నా సిఆర్మో మిషన్ లేక కేవలం చికిత్స మాత్రమే జరుగుతుంది. కేసులన్నీ రిఫర్ చేయడం వలన రోగుల పరిస్థితి ఆందోళనగా మారింది.

అనాటి సేవలే మెరుగు



అప్పట్లో డాక్టర్లు అందించిన సేవలే మెరుగు. ఇప్పటికీ ఆ డాక్టర్ల సేవలు గురించి ప్రజలు చెప్పుకుంటారు. ఏనాడూ జిల్లాకు రిఫర్ చేసిన వి అరుదు. ఇప్పుడు ఏరియా ఆస్పత్రిలో స్పెష లిస్టులు ఉన్నా సేవల్లేవు. ప్రధానంగా మహిళా రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

- ఆర్‌వీ సత్యనారాయణ, సీపీఎం నాయకుడు, చింతలపూడి

రేపు జాబ్ మేళా

ఏలూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏలూరు శివారు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహిస్తున్న ట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థజిల్లా మేనేజర్ జితేంద్ర తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలుండి, 18-35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువత హాజరుకావాలని, మరిన్నీ వివరాలకు 89785 24022, 96663 22032 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫ్యూజ్ బాక్సుకి రక్షణ చర్యలు
ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పోలవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో అంజనేయ స్వామి ఆలయ సమీపంలో రక్షణ లేని ఫ్యూజ్ బాక్సు ప్రమాదకరంగా ఉందంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. విద్యుత్ శాఖ అధికారులు ఫ్యూజ్ బాక్సుకి రక్షణగా బాక్సులు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాట్నాలమ్మ ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



పెదవేగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించామని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. 108 రోజులకు రూ.16 లక్షల 33 వేల 035లు ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు తనిఖీదారు వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ పాలకవర్గం మాజీ చైర్మన్ ఆర్.ఉమామహేశ్వరరావు, భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి, ఆదాయాన్ని లెక్కించామని ఈవో వివరించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షల్లో అర్హత సాధించి, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ అభ్యర్థులకు ఏలూరు బీసీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఆర్.నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, ఈబీసీ, యుడబ్ల్యుఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, టీటీసీ, బీఈడీ అర్హత కలిగి కుల, ఆదాయ, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో ఏలూరులో ఉన్న బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్‌లో వచ్చిన మార్కులు ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని, 60 రోజుల పాటు శిక్షణ, నెలకు రూ.1500 చొప్పున స్టైఫండ్, బుక్‌ఫండ్ రూ.వెయ్యి ఇస్తామన్నారు. మరింత సమాచారానికి 75691 84335 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

బుట్టాయగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 10 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు.

● చింతలపూడి : మండలంలో 38 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ప్రమద్వర తెలిపారు. 10, 11 తేదీలలో ఊటసముద్రం, 12, 13లలో చింతంపల్లి, 16న లింగగూడెం, గురుభట్లగూడెం, 17న రేచర్ల, తీగలవంచ, 18న చింతలపూడి, 19న వెంకటాద్రిగూడెం, కాంతంపాలెం, 20న ఎర్రగుంటపల్లి, 21న వెంకటాపురం, శెట్టివారిగూడెం, 23న మల్లాయిగూడెం, ఆముదాలచిలక, 24న గణిజర్ల, పోతునూరు, 26న రాఘవాపురం, 27న యండపల్లి, శివపురం, 28న ప్రగడవరం, 30న సీతానగరం, అల్లిపల్లి, 31న ఉర్లగూడెం, కనిపెడ, జనవరి 2వ తేదీన ఎర్రంపల్లి, తలార్లపల్లి, 3న వెంకంపాలెం, పొనుకుమాడు, 4న తిమ్మిరెడ్డిపల్లి, శంకుచక్రపురం, 6న పట్టాయిగూడెం, నామవరం, 7న ఆర్‌పి ఖండ్రిక, గోపాలపురం, 8న లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

● లింగపాలెం : రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందించాలని తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు.

● టి.నరసాపురం : ఈ నెల 10వ తేదీ నుంచి 2025 జనవరి 2వతేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సాయిబాబా తెలిపారు. బండివారిగూడెంలో జరగవలసిన గ్రామసభ ఎలక్షన్ కోడ్ ఉన్న కారణంగా బండివారిగూడెంకు మరో తేదీ ప్రకటించవలసి ఉన్నదని, మిగిలినవన్నీ షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని ఆయన తెలిపారు.

అదాని అక్రమాలపై విచారణ కమిటీ వేయాలి



ఏలూరులో ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డిమాండ్స్ డే నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.ప్రభాకర్ మాట్లాడుతూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానిని అవినీతిని సమర్థించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సీపీఐ నాయకులు యు.హేమశంకర్, కె.వరప్రసాద్, పి.కన్నబాబు, కె.బేబి, బి.కనకదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : అదానీ కంపెనీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని సీపీఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కె.గురవయ్య మాట్లాడుతూ అదానీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వేయాలని, అదేవిధంగా మణిపూర్ సంఘటనపై పార్లమెంటులో చర్చ జరగాలని, రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రమద్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు టి.బాబు, కృష్ణ, జానీ, కాలేషా, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, గత రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీలతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ అదానిగ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించట ంలో కేంద్ర ప్రభుత్వ పాత్ర పై దర్యాప్తు చేయాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించాలని రమణరాజు డిమాండ్ చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, సుంకర రాధాకృష్ణ, వడ్లమనాటి శ్రీను జగన్నాధ కృష్ణ, కూనపాముల విఘ్నేష్, బొక్కా శ్రీను, కొత్తూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిశోర్ పుట్టిన రోజు వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న కిషోర్

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఆయన ఇంటి వద్ద ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో కిశోర్ భారీ కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, కె.సుబ్బారావు, ఎన్.బాబీ, ఎం.లక్ష్మణరావు, తదిత రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు డాక్టర్ అక్రాయిడ్ నివేదిక ప్రకారం కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, రోజుకి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఇంజినీరింగ్ వర్కర్స్‌ని పెంచాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.వెంకటరమణరాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కె.వసంతరావు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు కె.వెంకటరావు, కార్యదర్శి ఎన్.సుబ్బారావు, పారిశుధ్య విభాగం కార్యదర్శి బి.శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు, ఎం.శ్రీను, ఎ.ముత్యాలరావు, డి.నాగరాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోనియా జన్మదిన వేడుకలు



జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదినోత్సవ వేడుకలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు సోనియాగాంధీ 78వ జన్మదినోత్సవ వేడుకలను స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బర్తడే కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఎల్.రామ్మోహన్, జి.రంగబాబు, డి.చంద్రశేఖర్, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, పాల్గొన్నారు.

● చింతలపూడి :స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సోనియాగాంధీ 78వ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా మండల శాఖ అధ్యక్షుడు వి.సుందరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి సోనియా అందించిన సేవలు, రుణమాఫీ గురించి వివరించారు. నాయకులు కె.కృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, బోసురెడ్డి పాల్గొన్నారు.

కేతవరం రెవెన్యూ సదస్సు వాయిదా

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు డిసెంబర్ 11వ తేదీ నుంచి జరుగుతాయని జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కె.స్లీవజోజి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన మండలంలోని కేతవరం గ్రామంలో జరగవలసిన రెవెన్యూ సదస్సు జనవరి 6వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల టీడీపీ సభ్యత్వాలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 60లక్షలకు పైగా టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం సభ్యత్వాలు పొందారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరిశ్యామ్ చంద్రశేషు తెలిపారు. సోమవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కార్యకర్తలకు సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ కార్యకర్తల కోసం బీమా సౌకర్యాలను కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. మంత్రినారాలోకేశ నాయకత్వంలో పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమనిధి ఏర్పాటు చేశారని అన్నారు. ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వం పొందాలని రూ.100లు రుసుంతో తీసుకునే సభ్యత్వం వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తుందని శేషు అన్నారు.

మానవ హక్కులపై
అతిథి ఉపన్యాసం

ఏలూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో 'మహిళలు- మానవ హక్కులు' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. సుప్రీం కోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త జెస్సీ కురియన్‌తాను వాదించిన వివిధ కేసుల గురించి వివరించారు. ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




బుట్టాయగూడెంలో సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న నాయకులు, పెదపాడులో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న విశ్వాసులు

బుట్టాయగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫెలోషిప్ నాయకులు సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పాస్టర్లకు పంచారు. అంతర్జాతీయ దైవ సేవకులు పాస్టర్ ఎస్.ప్రేమరాజు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు పి.దావీదు, ఉపాధ్యక్షుడు జె.యోసేబు, కార్యదర్శి కె.దానియేలు, పాస్టర్లు పి.దావీదు, పి.కుమార్ పాల్, జార్జీ ముల్లర్, షేక్ పాల్, ఎం.జోషఫ్, సిహెచ్ అంలెగ్జాండర్, వై.డానియేల్ రాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రేమ విందు స్వీకరించారు.

● పెదపాడు : ప్రపంచ శాంతికే ఏసుక్రీస్తు జన్మించారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ తెలిపారు. పెదపాడులో మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో నవ్యశ్రీ కూటమి నాయకులు, పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ సెమి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నవ్యశ్రీ మాట్లాడుతూ ఏసు పుట్టినరోజు గుర్తుగా ప్రతి ఒక్కరం ముందుగా సెమిక్రిస్మస్ వేడుకలు నిర్వహించు కుంటారన్నారు. బైబిల్ వ్యాక్యాలను చదివి విన్పించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కూటమి నాయకులు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ, విశ్వాసులు పాల్గొన్నారు.

పితానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా కొమ్ము చిక్కాలలోని ఆయన ఇంటి వద్ద సోమవారం కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసినట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తెలిపారు. రాష్ట్ర శెట్టి బలిజ, కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రాలింగేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సంబూరి రామచంద్ర రాజు, మడ్డి రామారావు, తాళ్ళూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

లింగపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో కె.మురళీకృష్ణ సూచించారు. తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందుతుందని తెలిపారు.

సీపీఎం మహా సభ పోస్టర్ ఆవిష్కరణ

చింతలపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయిగూడెంలో జరగనున్న ఏలూరు జిల్లా సీపీఎం మహాసభల పోస్టర్‌ను కార్యాలయం వద్ద మండల కమిటీ కన్వీనర్ పాండురంగారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ జిల్లా మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పాండురంగారావు తెలిపారు. విద్యుత్ చార్జీల భారంపై పోరాటం చేస్తామన్నారు. ముందుగా ప్రజా నాట్య మండలి కళాకారుడు జి.సుబ్బారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. సీపీఎం నాయకులు సూర్యకుమార్, ఆర్‌వీ సత్యనారాయణ, రాహుల్, అనురాధ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపండి

బుట్టాయగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో షాపింగ్స్ మాల్స్ ఇతర అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రామకృష్ణ డిమాండ్ చేశారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, మాముళ్ల మత్తులో జోగుతున్నారని మండిపడ్డారు. వెంటనే అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని లేకుంటే గిరిజనులతో కలిసి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

కామన్ సైట్ ఆక్రమణపై ఫిర్యాదు

ఉంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలోని వైస్సార్ కాలనీలో ఏ బ్లాక్‌లో ఇ.ఏడుకొండలు ఇంటి వద్ద ఉన్న కామన్ సైట్‌ను కొంత మంది ఆక్రమించి రేకుల షెడ్లు వేశారని స్థానిక యువ న్యాయవాది టి.రాజేష్ ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో కార్యదర్శితో మాట్లాడి తక్షణమే ఆ ఆక్రమణను తొలగించాలని ఆదేశించారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



పెదవేగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నడిపల్లిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా నలు మూ లల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య పోటీలు రసవత్తరంగా జరుగుతున్నారు. ప్రతిరోజు 8 జట్లకు పోటీలు నిర్వహిస్తున్నామని జనసేన పార్టీ నాయకుడు జి.సురేష్ తెలిపారు. మరో వారం రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేస్తామని ఆయన చెప్పారు.

క్రైమ్ కార్నర్

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీ నిర్వహించి చికెన్ వ్యర్థాలతో కూడిన ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై కె.శారదసతీష్ తెలిపారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● భీమడోలు : కురెళ్ళగూడెం జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని భీమడోలు పోలీసులు అడ్డుకున్నారు. పది టన్నుల చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టారు. ఈ మేరకు లారీ ఓనర్ అబ్బాస్, డ్రైవర్ మహ్మద్ గౌస్‌లను అరెస్టు చేసి లారీలో ఉన్న చికెన్ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తోకలపల్లికి చెందిన చేపల చెరువు యజమాని భలేరాము బొలేరా వ్యానులో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను కురేళ్ళగూడెం గ్రామంలో భీమడోలు పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి డ్రైవర్ సువర్ణరాజు, భలే రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



జీలుగుమిల్లి, డిసెంబరు, 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమ ంగా మద్యం కల్గిన మహిళ పై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీను బాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. పి.అంకంపాలెంకు చెందిన ఒక మహిళ వద్ద అక్రమంగా 30 తెలంగాణ మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉండటంతో స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎస్సై జి.వెంక టలక్ష్మీ, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమడోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంపురం శ్మశానంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,520 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమడోలు పోలీసులు తెలిపారు.

ఆ..ఆనందం మాటల్లో చెప్పలేనిది

సొంత ఊరిలో అరంగేట్రం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే 11 ఏళ్ల పాటు కూచిపూడిలో శిక్షణ

సంతోష్ కుమార్‌తో ఆంధ్రజ్యోతి మాటా..మంతీ..



ఆయన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి...కళలపై ఆయనకు ఉన్న ఇష్టంతో ఒక పక్క ఉద్యోగం చేస్తూనే 11 ఏళ్లపాటు కూచిపూడి నృత్యం నేర్చుకున్నారు.. తన సొంత ఊరిలో అరంగేట్రం చేయాలని అనుకున్నారు.. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న వీరవాసరం మండలం నర్సన్న చెరువుపాలేనికి చెందిన మల్లుల సంతోష్ కుమార్ ఆదివారం కొణితివాడలోని ఉన్నత పాఠశాల్లో నృత్య ప్రదర్శన చేశారు. సొంత ఊరిలో నా అనుకునే వారి మధ్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో ఆనందం ఇచ్చిందని ఇది ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి అని సంతోష్‌కుమార్ అన్నారు... ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఆయనను పలకరించగా కళాకారుడిగా తన ప్రయాణం ఎలా సాగిందీ వివరించారు.. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

చిన్నప్పటి నుంచి ఇష్టం..

కొణితివాడలో చదువుకుంటున్న సమయంలోనే 12వ ఏట అదే గ్రామానికి గోవర్ధనం నరసింహాచార్యుల వద్ద కూచిపూడి నేర్చుకున్నాను. పాఠశాలల్లో ఫంక్షన్లలో నృతం చేసేవాడిని అలా నృత్యంపై అభిమానంతో నేర్చుకున్నారు. అప్పట్లో పదవ తరగతిలో మండలం ఫస్ట్ రావడంతో నూజివీడు ఐఐటీలో సీటు వచ్చింది. ఇంటర్, ఇంజనీరింగ్ అంతా అక్కడే చదువుకున్నా...దాంతో కొంతకాలం కళకు దూరం కావలసి వచ్చింది.

ఉద్యోగం వచ్చిన తరువాత..

బెంగళూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. మళ్లీ నాట్యంపై ఆసక్తి కలిగింది.. కూచిపూడి నేర్పేవారు ఎవరైనా ఉన్నారా అని వెతికే ప్రయత్నంలో వెంపటి మాష్టర్ శిష్యుడు ఉదయ్ కాంత్ శిక్షణ ఇస్తున్నారని తెలిసి అక్కడకు వెళ్లి అడిగాను.. ఆయన దగ్గర 11 ఏళ్ల పాటు నేర్చుకున్నా.. ఆయనతో కలిసి కర్ణాటక, కేరళ, తెలంగాణ ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలో పాల్గొన్నాను. ఆనంద గణపతి, దశావతారాలు, బాలగోపాల తరంగం వంటివి నేర్చుకున్నాను.

సహ ఉద్యోగులకు తెలియదు

నేను పనిచేస్తున్న కంపెనీలో ఎవరికి కళాకారుడునని, కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నానని తెలియదు. వీకెండ్ శనివారం, ఆదివారం శిక్షణ తీసుకునేవాడిని. అరంగేట్రం ఆహ్వాన పత్రికను మేనేజర్‌కు, తోటి ఉగ్యోగులకు ఇస్తే ఆశ్చర్యపోయారు. స్వయంగా టీమ్ మేనేజర్ దిలీప్‌కుమార్, సహ ఉద్యోగులు హరి, రాధాకృష్ణ వచ్చి చూశారు.. నా నాట్యం చూసి వారు వ్యక్తం చేసిన సంతోషం అంతు లేనిది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

నరసన్న చెరువుపాలెంలో మాది సామాన్యమైన కుటుంబం. తండ్రి సత్యనారాయణ దర్జీగా పనిచేసేవారు.. తల్లి వెంకట లక్ష్మి ఇంటి వద్దనే ఉండేవారు. నా ఆసక్తిని చూసి నృత్యం నేర్చుకుంటున్నా ప్రోత్సహించేవారు. నాకు మూడేళ్ళ క్రితం పెళ్లయింది. నా భార్య శిరీషకు కూచిపూడి నృత్యంపై ఉన్న ఇష్టాని చెప్పినప్పుడు తనకు అంతగా అవగాహన లేకపోయినా నేనే చేస్తున్న నృత్యాల వీడియోలు చూసి ప్రోత్సాహం అందించింది.

పిల్లలకు నృత్యం నేర్పించాలి

నేటి తరం చిన్నారులకు నాట్యంపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా అవగాహన కల్పించాలన్నదే నా ఆశయం.. అరంగేట్రం తర్వాత చాలామంది మా పిల్లలకు కూడా నేర్పుతారా..? ఎక్కడ నేర్చుకోవాలి? అని తల్లి తండ్రులు అడు గుతుంటే ఎంతో ఆనందం కలిగింది. ఇందుకోసం కృషి చేస్తా..

-భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి)

త్వరలో హౌసింగ్ బిల్లులకు మోక్షం



సోమవరంలో 6 ఏళ్ళ తరువాత బిల్లు విడుదల కానున్న పక్కా ఇల్లు

చాట్రాయి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2014-19 మధ్య ఉన్న హౌసింగ్ పెండింగ్ బిల్లులకు త్వరలో మోక్షం కలగనున్నది. 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవటంతో అప్పటి వరకు ఉన్న హౌసింగ్ పెండింగ్ బిల్లులను ఇవ్వకుండా వైసీపీ సర్కార్ మొండి చెయ్యి చూపించింది. గత 5, 6 ఏళ్ళ నుంచి ఎప్పటికైనా బిల్లులు వస్తాయనే ఆశతో పేద లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హౌసింగ్ పెండింగ్ బిల్లులు విడుదలకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సర్కార్ ఆదేశాల మేరకు హౌసింగ్ శాఖ సిబ్బంది పెండింగ్ బిల్లులపై సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అధికారిక లెక్కల ప్రకారం వైసీపీ సర్కార్ అధికారం చేపట్టే నాటికి మండలంలో పక్కా ఇళ్ళ పరిస్థితి ఇది. బేస్‌మెంట్ లెవెల్‌లో 167 ఇళ్ళు, రూఫ్ లెవెల్‌లో 73, స్లాబ్ వేసినవి 566, పూర్తి అయినవి 67, శాంక్షన్ అయ్యి అప్పటికి మొదలు కానివి 325 మొత్తం 1230 ఇళ్ళు ఉన్నాయి. ఈ లబ్ధిదారులలో ఎక్కువ శాతం మంది అప్పులు చేసి ఇళ్ళు పూర్తి చేసుకొని వాటిల్లో నివాసం ఉంటున్నారు. అప్పుడు ఉన్న యూనిట్ ధర రూ.1.50 లక్షలు ప్రాతిపదికన బిల్లులు చెల్లించనున్నారు.

ప్రభుత్వానికి నివేదిక

హౌసింగ్ పెండింగ్ బిల్లులపై సమగ్ర సర్వే జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపాము. మండలంలో 18 గ్రామాల్లో 1230 మంది లబ్ధిదారులకు రూ.2.35 కోట్ల బిల్లులు చెల్లించవల్సి ఉంది. 2025 మార్చి లోగా లబ్ధిదారులకు బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

- జె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఏఈఈ, చాట్రాయి

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలి పారు. మైసూరులో నిర్వహించిన హ్యాకథాన్‌లో ట్రిపుల్‌ఈ బ్రాంచ్‌కి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్మార్ట్ ఆటోమేషన్ ప్రాజెక్టు ను రూపొందించారన్నారు. జాతీయస్థాయిలో 500 ప్రాజెక్టులు ఈ హ్యాకథాన్‌కు రాగా మొద టి ఐదు స్థానాల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్‌ఆటోమేషన్ ప్రాజెక్టు నిలిచిందని, తద్వారా ఈనెల 12,13 తేదీల్లో నిర్వహించే ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు.

నేడు ఉచిత

కంటి వైద్య శిబిరం

ముసునూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో టీడీపీ యువనేత యు.గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ వాసన్ కంటి ఆస్పత్రి వైద్యులతో శుక్లాలు, పొరలును గుర్తించి, వారికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేయడంతోపాటు డ్రాప్స్ కూడా ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆగిరిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లోగంటపల్లిలో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆగిరిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈదులగూడెం గ్రామంలో పామర్తి శివను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసునమోదు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆవులయ్య తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కళాశాల విద్యార్థులతో ప్రతినిధులు

ఆగిరిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఆగిరిపల్లి ఎంవీఎస్ వైవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవినీతి రహిత సమాజం-యువత పాత్ర అంశంపై నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ కూరాటి యోహాన్ అధ్యక్షత వహించారు. ఇండియన్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు, కార్యదర్శి లాల్ సాహెబ్, ఆగిరిపల్లి, ఈదర గ్రామ ప్రముఖులు చౌటుపల్లి విక్టర్‌బాబు, దొండపాటి ఏసుపాదం సారధ్యంలో కళాశాల యువతకు మార్గదర్శకాలను వివరించారు. విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

విద్యుత్ వాహనాలపై పరిశోధనలు చేయాలి



సదస్సులో పాల్గొన్న అధ్యాపక విద్యార్థులు

ఆగిరిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరుగుతుందని, దానికి తగినట్లుగా విద్యుత్ వాహనాలపై మరింత పరిశోధన చేయాలని ఎస్ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగ భాస్కర్ అన్నారు. కళాశాలలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.శంకర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వాహనాల్లో పవర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఎలా ఉపయోగించాలో వివరించారు.



కృత్రిమ కాళ్లు అందజేత

ఆగిరిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో గానీ ప్రమాదంలో గానీ శరీర అవయవాలు పోగొట్టుకున్న దివ్యాంగులకు దాతల సహకారం ఎంతో స్ఫూర్తిదాయకమని హీల్‌సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్ అన్నారు. ధనశిక్ష చారిటీస్ సంస్థ సహకారంతో 15మంది దివ్యాంగ బాలలకు కృత్రిమ కాళ్ళను అందజేసిన సందర్భంగా ధనశిక్ష సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ధనశిక్ష సంస్థ ప్రతినిధులు సమీర్, లక్ష్మణ్, రితేష్, స్నేహిత్, ఖాదర్, హీల్ ప్రిన్సిపాల్ బి.సాయిబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

చాట్రాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 11వ తేదీ నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. 11వ తేదీన జనార్ధనవరం, 12న తుమ్మగూడెం, 13న చనుబండ, 16న పోలవరం, 17న మంకొల్లు, 18న చిన్నంపేట, 19న ఆరుగొలనుపేటలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. 20న కోటపాడు, 21న సోమవరం, 23న కృష్ణారావుపాలెం, 24న చిత్తపూరు, 26న పోతనపల్లి, 27న బూరుగ్గూడెం, 28న పర్వతాపురం, 30న కొత్తగూడెంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, చాట్రాయిలో రెవెన్యూ సదస్సు ఎప్పుడు జరిగేది తరువాత ప్రకటిస్తామన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చెయ్యాలి

చాట్రాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చెయ్యాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలసాని వెంకట రామారావు, జిల్లా రైతు సంఘం నాయకుడు నిమ్మగడ్డ నరసింహా డిమాండ్ చేశారు. చనుబండలో సోమవారం సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావటమే ఏకైక లక్ష్యంతో రాజకీయ పార్టీలు అలవికాని హామీ లు ఇచ్చి పీఠం ఎక్కాక కుంటిసాకులతో కాలయాపన చేయటం షరామామూలు అవుతున్నదని అన్నారు. ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీ అయినా ఆదాయ పరిమితికి మించి హామీలు ఇవ్వకుండా పార్లమెంట్‌లో చట్టం చెయ్యాలని కోరారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

నూజివీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దాఖలైన అర్జీలకు వివిధశాఖల అధికారులు సత్వరం పరిష్కారం చూపాలని నూజివీడు ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 18 అర్జీలు దాఖలైనట్లు ఆమె తెలిపారు. రెవిన్యూ సంబంధిత సమస్యలు అధికంగా ఉంటున్నాయని తెలిపారు.

అభయారణ్యంలో చేపల చెరువులు

చెరువులకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లుపై జేసీకి ఫిర్యాదు



చెరువులు మీదుగా కరెంటు వైర్లు



ఏలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంటూరు పరిధిలో లేని చెరువుల పేరుతో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని అక్కడి నుంచి కరెంటువైర్లు ద్వారా కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఉన్న చేపల చెరువులకు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ చేపల సాగు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి కె.తులసి ధర్మతేజ, పలువురు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఏలూరు రూరల్ మండలం, పెదపాడు ప్రాంతాల్లో కొల్లేరు అభయారణ్య పరిధిలో అక్రమ చేపలచెరువులు తవ్వారని వాటిలో చేపలు సాగుచేస్తున్న చెరువులకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా చేపలసాగు చేస్తున్నారని జేసీ దృష్టికి తీసుకువెళ్ళారు. కాంటూరు పరిధిలో లేని చెరువుల పేరుతో విద్యుత్‌కనెక్షన్ తీసుకుని వైర్లుద్వారా అభయారణ్యపరిధిలో ఉన్న చేపల చెరువులకు విద్యుత్ వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ విద్యుత్‌వైర్లు చేపలచెరువు గట్లమీద నుంచి వేయటం వల్ల కొల్లేరులోకి ఆహారం కోసం వచ్చే పశువులు విద్యుత్‌వైర్లు తగిలి షాక్‌కు గురై చనిపోతున్నాయన్నారు. గతవారం రూరల్ మండలం చాటపర్రులో పట్టాభూముల నుంచి అభయారణ్యపరిధిలో ఉన్న చేపల చెరువుకు విద్యుత్‌కోసం వైర్లు ఏర్పాటుచేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఒక యువకుడు మృతిచెందాడని జేసీ దృష్టికి తీసుకువెళ్ళారు. విద్యుత్ కనెక్షన్ల పై చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదని జేసీ దృష్టికి తీసుకువెళ్ళారు. రూరల్ మండలంలో కలకుర్రు గ్రామంలో అక్రమ విద్యుత్‌కనెక్షన్‌ల పై స్థానిక విద్యుత్‌శాఖ అధికారి ఓ వ్యక్తిపై చర్యలు తీసుకుని సుమారు లక్షా70వేలు జరిమానా విధించారని కలకుర్రు గ్రామంలో అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టుకున్న సుమారు ఏడుగురిపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు పెట్టకుండా చెరువులకు ఇచ్చే సబ్సీడీ కరెంటు దుర్వినియోగం కాకుండా చూడాలని, ప్రస్తుతం పత్తికోళ్ళలంక, గుడివాక లంక, శ్రీపర్రు, మొండికోడు, పైడిచింతపాడు, కొక్కిరాయలంక, పెదపాడు మండలం వడ్డిగూడెం, గుడిపాడు గ్రామంలో ఉన్న అక్రమ చేపల చెరువుల పైకి విద్యుత్‌కనెక్షన్ పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకుని కనెక్షన్ తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

శిశువు మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు: సీఐ

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే పుట్టిన నవజాత శిశువు మృతదేహం ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు అశోక్ నగర్‌లోని ఒక నవజాత శిశువు మృతదేహం ఉందని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేయగా సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో ఉన్న బాలిక డెలివరీ అయినట్లు గుర్తించామన్నారు. 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ఆమెకు డెలివరీ జరిగిందని ఆమె పరిస్థితి క్షీణించడంతో వెంటనే ఆసుపత్రికి తరలించామన్నారు. ఆ శిశువు మరణానికి కారణాలు తెలుసుకోవడానికి పోస్టుమార్టం జరిపిస్తున్నామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కొన్ని సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కొంతమంది ఊహాగానాలతో దర్యాప్తునకు ఆటంకం కలిగించేలా వ్యాఖ్యానం చేస్తూ దర్యాప్తును పక్కదారి పట్టించేలా ప్రచారం జరుగుతుందన్నారు. ఏదైనా అనుమానాలు ఉంటే తనను సంప్రదించాని సీఐ వైవి రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర విచారణ చేయండి



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్రబాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, సభ్యులు రాజేంద్రప్రసాద్

ఏలూరు అశోక్‌నగర్‌లో ఉన్న మిషనరీ వసతి గృహం నుంచి ఓ శిశువును బయటకు విసిరేసిన సంఘటనపై రాష్ట్రబాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ స్పందించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదికను మూడు రోజుల్లో రాష్ట కమిషన్‌కు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ సంఘటనను సుమోటోగా రాష్ట బాలల హక్కుల కమిషన్ స్వీకరించి ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులపై శాఖాపరమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. వసతి గృహం సిబ్బంది, తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరు విధిగా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని వారు తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముదినేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో కొలువై ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు, వేదపండితులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం అలంకరించిన కల్యాణ రథంపై స్వామిని, అమ్మవార్లను సింగరాయపాలెం, చేవూరుపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో ఊరేగించారు. రథానికి ఇంటింటా మహిళలు హారతులిచ్చి పూజలు జరి పారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన కళాకారులు కేరళ తరహా సంప్రదాయ దుస్తులతో నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం మాజీ చైర్మన్ పసుపులేటి నరసింహారావు, రైల్వే స్టేషన్ కమిటీ సభ్యుడు మేలిమి చిట్టిబాబు పాల్గొన్నారు. సీఐ రవికుమార్, ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. మంగళవారం రాత్రి సుబ్రహ్మణ్యే శ్వరస్వామి తెప్పోత్సవం జరగనుంది. ఇందుకు దేవస్థానం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీ గంగా శ్రీదేవి తెలిపారు. ముదినేపల్లిలోని పంచముఖ శివనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కమిటీ అధ్యక్షుడు నల్లమోతు ప్రసాద్ ఆధ్వర్యంలో షష్టి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

వైభవంగా షష్టి ఉత్సవాలు

కలిదిండి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు ముద్దం బులి వెంకయ్య, డి.నాగు, డి.రామలింగేశ్వరరావు, కె.మధునాగు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అన్నసమారాధన కార్యక్రమం

మండవల్లి డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం సాయంత్రం అన్న సమారాధన జరిగింది. మండవల్లి పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

కైకలూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పేరుకుపోయినా భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఈ నెల 11 నుంచి నిర్వహిస్తోంది. మండల రెవెన్యూ అధికారులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆయా మండలాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఈనెల 11వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో 11వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, కైకలూరు, మండ వల్లి మండలాల్లో ఈ నెల 11వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కైకలూరు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు.

కైకలూరు మండలంలో..

11వ తేదీన కొట్బాడ, 12న పెంచికలమర్రు, 13న ఆలపాడు, 16న సోమేశ్వరం, 17న ఆటపాక, 18న కైకలూరు, 19న పల్లెవాడ, 20న భుజబలపట్నం, 21న గోనెపాడు, 23న సింగాపురం, 24న వదర్లపాడు, 26న సీతనపల్లి, 27న దొడ్డిపట్ల, 28న రామవరం, 30వ తేదీని వరహాపట్నం, 31న గోపవరం, జనవరి 2న రాచపట్నం, 4న వింజరం, 6న శ్యామలాంబపురం, 7న తామర కొల్లు, 8న వేమవరప్పాడు, 9న శృంగవరప్పాడు.

ముదినేపల్లి మండలంలో...

11న చేవూరు, 12న పెదగొన్నూరు, 13న వణుదుర్రు, 16న వాడవల్లి, 17న ఊటుకూరు, 18న వైవాక, 19న పెదపాలపర్రు, 20న చిన్నపాలపర్రు, 21న ముదినేపల్లి, 23న దాకరం, 24న పేరూరు, మాధవరం, 26న పెయ్యేరు, 27న చిగురుకోట, 28న చినకామనపూడి, పెదకామనపూడి, 30న వడాలి, కోమర్రు, 31న కాకర వాడ, దేవరం, కోడూరు.

మండవల్లి మండలంలో...

11న పెనుమాకలంక, 12న నందిగామలంక, 13న ఇంగిలిపాకలంక, 16న పెరికేగూడెం, 17న పులపర్రు, పిల్లిపాడు, 18న నుచ్చిమిల్లి, 19న తక్కెళ్లపాడు, 20న చింతపాడు, దెయ్యంపాడు, 21న కొవ్వాడలంక, 22న మణుగులూరు, 23న శింగనపూడి, 24న మూడుతాళ్లపాడు, 26న మండవల్లి, 27న గన్నవరం, మోకాసలకలవపూడి, 28న కానుకొల్లు, 30న లింగాల, 31న పుట్లచెరువు, పసలపూడి, జనవరి 2న చింతలపూడి, లేళ్ళపూడి, 3న అయ్యవారి రుద్రవరం, 4న అప్పాపురం, పత్తిపాడు, 6న ఉనికిలి, 7న చావలిపాడు, 8న లోకుముడి, 9న భైరవపట్నంలో నిర్వహిస్తారు.

చెత్త నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

కైకలూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తను రోడ్ల వెంబడి వేయవద్దని పంచాయతీ కార్యదర్శి జి.రవికిరణ్ అన్నారు. ఆటపాకలో సోమవారం జాతీయ రహదారి వెంబ డి ఉన్న చెత్తను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో చెత్తపోగులను తీసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు చెత్తను ఇంటింటికి వచ్చే రిక్షాల్లో చెత్తను వేయాలని సూచించారు. ప్రస్తుత శీతాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉండుట వలన చెత్త నిర్మూలనకు సహకరించాలని కోరారు.



ట్రాక్టర్లలో చెత్తను తరలిస్తున్న దృశ్యం



వాడవల్లిలో దుప్పట్లు అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

పూర్వపు విద్యార్థుల వితరణ

ముదినేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు కాజ లక్ష్మీనారాయణ జిల్లా పరిషత్ హైస్కూలు 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పలు గ్రామాలకు చెందిన పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ హైస్కూలు పూర్వపు విద్యార్థులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడివాడ మెయిన్ బ్రాంచి డిప్యూటీ మేనేజర్ గుడివాడ రాజశేఖర్, మాదాసు సత్యనారాయణ, దాకారపు శ్రీనివాసరావు, బండి కుటుంబరావు, పడమటి సత్యనారాయణ, తుమ్మలచర్ల శ్రీనివాసరావు, విజయ్ కుమార్ తదితరులు వాడవల్లి, కొత్తపల్లి, ఉప్పరగూడెం, పెదగొన్నూరు గ్రామాలకు చెందిన వంద మందికి దుప్పట్లను పంపిణీ చేశారు.



కొత్తపల్లిలో నిర్మించిన సాయిబాబా మందిరం

రేపు కొత్తపల్లిలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో నిర్మించిన షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 11న విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరుగనుంది. సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఆ గ్రామానికి చెందిన దాత సూదాబత్తుల బాలకృష్ణ దంపతులు ఆలయాన్ని నిర్మించగా, బాబా విగ్రహాన్ని అడబాల నాగ ప్రసాద్ దంపతులు విరాళంగా అందజేశారు. 11న ఉదయం 8.32 గంటలకు బాబా విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



రోడ్డును మూసేసిన పొదలు

ముదినేపల్లి - పెయ్యేరు పంచాయతీరాజ్ రోడ్డు ముళ్ల పొదలతో మూసుకుపోయింది. రోడ్డుకు రెండు వైపులా చెట్లు దట్టంగా పెరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

- ముదినేపల్లి